
₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8
పక్షపత్రిక

సంచిక - 21
నవంబర్ 1-15, 2017



## ఉలిచి - దేశానికే దిక్సూచి

ఉద్దానం కిడ్నీ వ్యాధిపై పరిశోధనకు ప్రాధాన్య మివ్వాలి

తెలంగాణ భూసర్వేలో 'సమగ్రత' ఎంత?

ఓబీసీ ఉప వర్గీకరణ



# నిరుద్యోగ భృతితో బిచ్చమేస్తారా?
# 'ఉద్యోగాల' చుట్టూ రాయితీల విధానం తెండి





# ఆహార కల్తీపైనా ప్రజాఉద్యమం

పెట్రో కల్తీపైన మలిదశ ఉద్యమాన్ని వెబినార్ ద్వారా ప్రారంభించామని, దీన్ని విస్తృతపరచటంతోపాటు ఆహారకల్తీపైనా ప్రజాఉద్యమాన్ని నిర్మిస్తామని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

ప్రజలు తమ సంపాదనలో ఎక్కువ భాగాన్ని ఆహారం మీదే ఖర్చు చేస్తున్నా వారికి కల్తీ లేని ఆహారం దొరకడం లేదని జేపీ అన్నారు. దాదాపు 90శాతం మేర మనం తనిఖీ చేయని ఆహారపదార్థాలనే తింటున్నామన్నారు. అదేసమయంలో, ఆహారధాన్యాల ఉత్పత్తుల్ని చేసే రైతులకూ న్యాయమైన ధర రావటం లేదన్నారు. ఆహారకల్తీని అరికట్టలేకపోతే వైద్య ఆరోగ్యం, విద్య, ఉపాధి, ఉత్పత్తి తదితర ముఖ్యమైన రంగాలన్నిటి నుంచీ మనం వ్యక్తులుగా, సమాజంగా, దేశంలో నష్టపోతామన్నారు.

పెట్రో, ఆహార కల్తీ వంటి అంశాలపై (వికేంద్రీకరించిన) చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా యువత, ఇతర ప్రజానీకం స్థానికంగా తాము ఉన్నచోటు నుంచే పాల్గొనవచ్చని, తమ జీవితాల్ని బాగు చేసే పెద్ద ఫలితాలను సాధించుకోవచ్చని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ (వైబీఐ), సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌ల ద్వారా నమోదవుతున్న యువత, పేదలు, మధ్యతరగతి తదితరులంతా తమతమ ప్రాంతాల్లో ఈ ఉద్యమాల్లో భాగస్వాములవుతారని జేపీ తెలిపారు.


ఆహారకల్తీపై పోరాటానికి ఎలాంటి పరికరాలను ఏరకంగా ఉపయోగించవచ్చో ఇటీవల హైదరాబాద్ ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) బృందంతో కలిసి కార్యాలయంలో జేపీ పరిశీలించారు. ఆహారకల్తీని గుర్తించేందుకు తాము రూపొందించిన కిట్‌ను ఎలా ఉపయోగించాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ మేనేజ్‌మెంట్ అండ్ కన్స్యూమర్ సైన్సెస్ (పీఎస్‌జీఆర్‌పీయూ) శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కిట్‌తో ఇంట్లోనూ, బైట కూడా కల్తీని గుర్తించి ఆరోగ్యాన్ని, ఆదాయాన్ని కాపాడుకోవచ్చు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

నవంబర్ 1-31, 2017 సంపుటి - 8 సంచిక - 21




# కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ఎన్ని ఉద్యోగాలిస్తారో అడగండి..................... 5
ముందు మీ గురించి ఆలోచించుకోండి............8
చెప్పుతో కొట్టాలనటం డ్రామానే.................... 10
చంద్రబాబూ ప్రభుత్వ పాఠశాలలోనే ...............11
ఈ తరానికి అద్భుతావకాశాలున్నాయి............. 12
ప్రభుత్వం ఓ రూ.2,000 ఖర్చు...................... 14
వాడు వీడ్ని తిట్ట, వీడు వాడ్ని తిట్ట, ...................15
ఐదురోజుల ఖర్చు డబ్బును అదనంగా ఇస్తే.......... 17
ఉద్దానం కిడ్నీవ్యాధి మూలాల పరిశోధనకు....... 19
ఆ డబ్బు మోదీది కాదు, చంద్రబాబుది కాదు,...... 20
జనం చేతికి అధికారం+జవాబుదారీతనం=.... 21
సమగ్ర భూ సర్వేలో 'సమగ్రత' ఎంత?............. 27
చరిత్రలో చిరస్థాయిగా ' కారా'...................... 30
ప్రభుత్వాసుపత్రులను బాగుచేయటమంటే........ 31
గురజాడ అడుగుజాడ మరో వందేళ్లయినా ........ 32
బాలికల చదువు దేశాభివృద్ధికి పునాది............ 33
పాలనా దారిద్ర్యానికి నిదర్శనం .................... 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

**బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి**

# ఓబీసీ ఉపవర్గీకరణ హడావుడి!



**సు**రాజ్య యాత్ర గడుస్తున్నకొద్దీ లోక్‌సత్తా పరిష్కారాల మీద నాకు, మా బృందానికి నమ్మకం మరింత దృఢతరమవుతోంది. కానీ ప్రజలందరికీ మౌలికంగా అవసరమైన, నేతలు ఊదరగొడుతున్న, చిన్న పరిష్కారాలున్న సమస్యలు కూడా ఏళ్ల తరబడి అలాగే కొనసాగుతుండటం మాత్రం బాధ కలిగిస్తోంది. ఇన్నేళ్ల పాలనలో.. ఇంగితజ్ఞానంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తి కూడా ప్రజలకు లేకుండా చేశారు. కలెక్టర్‌గా ఉన్నప్పుడు ప్రజలు ఆదివారం, పండుగ సెలవు, అర్ధరాత్రి అనే తేడా లేకుండా 24/7 ఎప్పుడైనా నా తలుపు తట్టవచ్చని ఇంటి ముందు బోర్డు పెట్టుకుని పనిచేశాను. ఆ తర్వాత రాజకీయ ఉద్యమకారునిగా, పార్టీ ప్రతినిధిగా, పౌరునిగా వేల సభలలో పాల్గన్నాను, పాల్గంటున్నాను. సమాజహితం కోరే కార్యకర్తలు, మిత్రులు, మీడియా ద్వారా ఎప్పటికప్పుడు సమస్యల్ని తెలుసుకుంటూ అధ్యయనం చేస్తూ పరిష్కారాల్ని అందిస్తూ.. సామాజిక మాధ్యమాలు, ఇతర సాంకేతిక మార్గాల ద్వారా ప్రజలతో నిరంతరం టచ్‌లో ఉంటుంటాను. ఈ మొత్తం పరిధికి ఆవల ఉన్నవారిని కూడా స్పృశించాలని, చిన్న పరిష్కారాలున్న పెద్ద సమస్యలను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ పరిష్కరించే కార్యక్రమాల్లో ప్రజలను, ముఖ్యంగా యువతను భాగస్వాముల్ని చేయాలని పార్టీలకతీతంగా, వినూత్నరీతిలో సురాజ్య యాత్రను చేపట్టాం. దీని గురించి చెప్పాల్సింది, చర్చించుకోవాల్సింది చాలానే ఉంది. వాటిని తర్వాత మాట్లాడుకుందాం. అందులో ఒక్క అంశం గురించి మాత్రం ఇప్పుడు చెప్పుకోవాలి. ఓబీసీ ఉపవర్గీకరణకు కేంద్రప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రస్తావన అవసరం. విద్యార్థులతో, యువతతో జరిపిన సురాజ్య సమావేశాల్లో దాదాపు ప్రతిచోటా రిజర్వేషన్ల గురించిన ప్రశ్న వచ్చింది. డిమాండ్ ఉన్న కోర్సుల్లో, ఉద్యోగాల్లో తమకు రావాల్సిన అవకాశాల్ని రిజర్వేషన్ల పేరుతో లాగేసుకుంటున్నారని కొందరు భావిస్తుంటే, రిజర్వేషన్లున్నా తమకు న్యాయం జరగటం లేదని ఇంకొందరు ఆక్రోశిస్తున్నారు. సామాజిక, ఆర్థికపరమైన ఈ దీర్ఘకాలిక సమస్యను చర్చించి పరిష్కరించే ప్రయత్నంలో ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. ఇప్పటికైనా పరిష్కారానికి చొరవ తీసుకోకుండా సంక్షోభాన్ని వాయిదా వేస్తూ లబ్ధి పొందే పాతరాజకీయ క్రీడనే కేంద్రంలోని పాలకులు కొనసాగిస్తున్నారు. ఓబీసీ వర్గీకరణ అవసరమనటంలో సందేహం లేదు. రిజర్వేషన్లను మంత్రులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సంపన్నుల పిల్లలకు ఇవ్వటం వల్ల ఆయా కులాల్లో దిగువన ఉన్న కోట్లాదిమందికి ఎప్పటికీ అవకాశం రాదని, అందువల్ల కోటా ద్వారా ఒకసారి లబ్ధిపొందిన వారికి రిజర్వేషన్లను వర్తింపచేయకూడదని లోక్‌సత్తా మొదటినుంచీ వాదిస్తోంది. కానీ అది కేవలం తొలి అడుగే! ఆ చిన్న పనిచేయటాన్ని ఏదో విప్లవాత్మక చర్యగా కేంద్రసర్కారు, మీడియాలోని ఓ పెద్దవర్గం హడావుడి చేస్తున్నాయి. సురాజ్య యాత్ర ద్వారా చిన్న పరిష్కారాలతో పెద్ద మార్పులను సాధించేందుకు లోక్‌సత్తా ప్రయత్నిస్తుంటే, బ్రహ్మాండమైన రాజకీయ, ప్రచార బలంతో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం మాత్రం పెద్ద హడావుడితో చిన్న మార్పుల చుట్టూ తిరుగుతోంది. రిజర్వేషన్ల చుట్టూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పరస్పర విరుద్ధ ఆక్రోశాలే దేశవ్యాప్తంగానూ ఉన్నాయి. రాజస్తాన్‌లో గుజ్జర్లు, హర్యానాలో జాట్లు, గుజరాత్‌లో పాటీదార్లు చేస్తున్న ఆందోళనలు.. ముదిరిన సంక్షోభానికి కొన్ని సంకేతాలు. ఓబీసీలకు ఏదో పెద్ద మేలు చేస్తున్నట్టు కనిపించటం వల్ల గుజరాత్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో మోదీ పార్టీకి ఎన్నికల్లో లబ్ధి కలగవచ్చు. కానీ మోదీ ప్రభుత్వం వాస్తవిక పరిపాలన అంచనాలను అందుకోవటంలో మరోసారి విఫలమవుతుంది. ఓబీసీ వర్గీకరణ ఎంత పరిమితమైన మార్పో ఇప్పటికే ఆ పనిచేసిన తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభం, సామాజిక అలజడి స్పష్టపరుస్తున్నాయి. మంచి పాలనకు - పార్టీ గెలుపునకు మధ్య మోదీ సమన్వయం చేసుకోలేకపోవటం దేశానికి తీవ్ర నష్టం చేస్తోంది. పాలకులు పైకి ఎంత గొప్పగా కనిపిస్తున్నా.. తాత్కాలిక, స్వార్థపూరిత అవసరాల కోసం తప్ప దేశప్రజల కోసం కాస్తయినా మంచి మనసుతో పనిచేసే సంస్కృతి తగ్గుతుండటం ప్రతికూల పరిణామం. ఓబీసీ ఉపవర్గీకరణకు ప్రత్యేకించి కమిషన్‌ను వేసి కొన్ని వారాల్లోగా నివేదికను తెప్పించుకుని ఏదోకరకంగా అమలుచేసేయొచ్చు. కానీ దాని వల్ల దేశం వైపు దూసుకొస్తున్న ఉద్యోగ సంక్షోభం ఆగదు. ఇంగితజ్ఞానానికి అర్థమయ్యే వాస్తవమిది. ఈవేళ యువతకు కావాల్సింది ఉద్యోగాలు, ఉద్యోగాలు, ఉద్యోగాలు! కోట్ల ఉద్యోగాలనిస్తామని మోదీ పార్టీ హామీ ఇచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవన్నీ ఎవరు చేశారో చూపించండి, గతంలో యూపీయే ప్రభుత్వం ఏం చేసింది? అని ఓవర్‌స్మార్ట్ రాజకీయాన్ని ప్రదర్శించే సమయం కాదిది. ఉద్యోగాల కోసం నెలకు కొత్తగా వస్తున్న 10లక్షల మంది రేపు కోపంతో, కసితో హింస, దోపిడీలకు దిగితే ఎలా ఉంటుందో ఊహించటానికే భయమేస్తుంది. ప్రభుత్వం సంకుచితత్వాన్ని, అభద్రతతను పక్కనపెట్టి ప్రజల పక్షాన చిత్తశుద్ధితో ఆలోచిస్తే, భిన్నమైన ఆలోచనల్ని స్వీకరిస్తే.. ఉద్యోగాల సృష్టికి విధానాలున్నాయ్! ఉద్యోగానికి ఇంతని పెట్టుబడి రాయితీగా ఇవ్వటం, ఉద్యోగంలో చేరినవారు ఏడాది జీతాన్ని రాయితీగా ఇవ్వటం వంటి మార్గాలతో విధానాలను రూపొందించి స్కిల్ డెవలప్‌మెంట్‌ను అనుసంధానిస్తే, ప్రభుత్వం మీద భారం లేకుండానే పెద్దఎత్తున ఉద్యోగాలను సృష్టించే అవకాశముంది. విద్యారంగాన్ని కూడా ప్రక్షాళన చేసి ప్రమాణాల్ని పెంచితే ఉపాధి ఊపందుకోవటంతోపాటు భవిష్యత్తులోనూ ధోకా ఉండదు. ఉక్కుమనుషులు, సైనికనియంతలు, దైవదూతలు అధికారంలోకి వస్తే అద్భుతాలతో తమను రక్షిస్తారనే భ్రమల నుంచి ప్రజలు ఇకనైనా బైటికి రావాలి. ఇంతకుముందే అనుకున్నట్టు, పాలకులు వారంతట వారు మంచి చేసే ధోరణులు తగ్గుతున్నాయి. రాజకీయం, విధానాల దిశను మారిస్తేనే తమ దశ మారుతుందని ప్రజలు ఎంత త్వరగా గుర్తించి ఇంగితజ్ఞానంతో స్పందిస్తే.. అంత త్వరగా పాలకుల్లో మార్పు వస్తుంది.

★

"ఎన్ని ఉద్యోగాలిస్తారు?" అని అడగండి, దాన్ని బట్టే పారిశ్రామిక రాయితీల్ని ఇవ్వండి అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

"మోదీజీ, చంద్రబాబు గారూ, కేసీఆర్ గారూ! ఉద్యోగాలు లేకుండా మన వద్ద పరిశ్రమలను పెట్టటం వల్ల మన ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. ఉద్యోగానికి రూ.50,000 వరకూ అయినా పర్లేదు, రాయితీ ఇవ్వండి. కానీ మన బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వని పరిశ్రమలను తీసుకొచ్చి మాత్రం రుద్దొద్దు. పారిశ్రామిక విధానాన్ని ప్రధానంగా ఉద్యోగాల చుట్టూ తిప్పండి" అని జేపీ అన్నారు.

పరిశ్రమ పెడతానంటే.. వంటి మీద బట్టలున్నాయో లేదో కూడా చూసుకోకుండా పెట్టుబడిదారుల వెంట పరిగెడుతున్నారని, రుణాలందిస్తున్నారని, కానీ ఆ పరిశ్రమల్లో ఎన్ని ఉద్యోగాలిస్తున్నారో మాత్రం పట్టించుకోవటం లేదని, ఇది యువతను మోసం చేయడమేనని జేపీ అన్నారు.



**ఉద్యోగాలంటే జెండాలు మోయటమా?**

మనదేశంలో యువతకు ఉద్యోగాలు సృష్టించటమంటే పార్టీల జెండాలు మోయటం, ప్రచారం చేయటం, ఓట్లు వేయించటంగా నేతలు భావిస్తున్నారని జేపీ అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కిమరీ యువతను పార్టీల కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు కూడా పోటాపోటీగా యువతను లంపేన్‌లుగా మారుస్తున్నారన్నారు.

# ఎన్ని ఉద్యోగాలిస్తారో అడగండి, ఆ లెక్కనే పెట్టుబడి రాయితీలివ్వండి: జేపీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భాష ఎలా ఉన్నా.. ఉద్యోగాలు కల్పించటంలో మాత్రం ఆయన్నుంచి మన పాలకులు నేర్చుకోవాలని జేపీ అన్నారు. కంపెనీ ఇచ్చే ఉద్యోగాలను బట్టే ట్రంప్ పన్ను రాయితీల్ని, ఇతర ప్రోత్సాహకాల్ని ఇస్తున్నారన్నారు. ఈ విషయంలో నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నారన్నారు.

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర రెండో షెడ్యూల్‌లో భాగంగా విజయనగరం జిల్లా మీదుగా జేపీ తగరపువలస చేరుకున్నారు. ఏసీపీ ఫౌండేషన్, సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం చిట్టివలస జ్యూట్‌మిల్ కళ్యాణమంటపంలో నిర్వహించిన కార్మిక సదస్సులో జేపీ మాట్లాడారు. జనం కోసం జేపీ సురాజ్య యాత్ర సెప్టెంబర్ 15, 2017న విశాఖపట్నం నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వాలు పెద్ద ఖర్చు లేకుండా వెంటనే పరిష్కరించగలిగే ఆరు అంశాలపై ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారాలు రూపొందించి సాధించేందుకు 100 రోజులపాటు సాగించే ఈ సురాజ్య యాత్రను తొలుత ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో జేపీ నిర్వహిస్తారు.

కార్మిక సంఘాల నేతలు, కార్మికులు ఉన్న ఈ సమావేశంలో జేపీ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, పౌరసమాజం కూడా ప్రస్తావించటానికి సాహసం చేయనిరీతిలో కార్మిక సంస్కరణల ఆవశ్యకతపై చర్చ లేవనెత్తారు.

మనదేశంలో నెలకు 10లక్షల మంది యువత కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నారని, నిజాయతీగల నాయకత్వం, సరైన విధానాలు, పోటీతత్వంగల అధికార యంత్రాంగం వంటివన్నీ ఉన్నా కూడా ఇన్ని ఉద్యోగాలను సృష్టించటం కష్టమని, ప్రపంచ చరిత్రలో ఎన్నడూ ఈస్థాయి నిరుద్యోగ పరిస్థితి లేదని జేపీ అన్నారు. స్వతంత్రం వచ్చినపుడు మనకంటే వెనకబడి వున్న చైనా.. ఆ తర్వాత అనుసరించిన పోటీ ఆర్థికవిధానాల వల్ల వేగంగా వృద్ధి చెందిందని, ఉత్పత్తిరంగాన్ని పెంచుకుంటూ కేవలం 10ఏళ్లలో కోట్ల ఉద్యోగాలను సృష్టించిందని, అటువంటి చైనా కూడా ఈ

## నిరుద్యోగ భృతి యువతను అవమానించటమే, ఏడాది జీతాలు రాయితీగా ఇచ్చే పద్ధతిలో లక్షల ఉద్యోగాలు తేవచ్చు

నిరుద్యోగ భృతి పాలకుల అసమర్థతేనని, యువతను అవమానించటమేనని జేపీ అన్నారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు సురాజ్య యాత్రలో మాట్లాడుతూ.. ప్రజలు కట్టిన పన్నుల డబ్బునే యధాతథంగా తిరిగిచ్చేకాడికి ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. ఒక ఉద్యోగి తన ఏడాది జీతాన్ని రాయితీగా ఇచ్చినా చాలా పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నారు. ఏపీలో 50లక్షలమంది నిరుద్యోగులున్నారనుకుంటే, వారు జీతంతో ఇచ్చే ఏడాది రాయితీతోనే స్కిల్ డెవలప్‌మెంట్ సంధానంతో కనీసం 8లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం మీద భారం లేకుండానే సృష్టించవచ్చన్నారు. ఇలాంటి పద్ధతుల్ని చర్చించి అనుసరించకుండా.. 40 ఏళ్ల వరకూ రూ.2,000 నిరుద్యోగభృతి అని ముఖ్యమంత్రి అంటే, 45 ఏళ్లకే రూ.2,000 పింఛను అని ప్రతిపక్ష నేత అంటున్నారన్నారు. ఈ బిచ్చం కోసమైతే మిమ్మల్ని ఎన్నుకోవటమెందుకు అని ప్రశ్నించారు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి మౌలికావసరాల్ని అందించటం కోసమే సురాజ్య యాత్ర అన్నారు.

స్థాయిలో ఉద్యోగాలను సృష్టించలేదన్నారు. అలాంటిది సరైన నాయకత్వం, విధానాలు, సమర్థ పాలనా యంత్రాంగం వంటివేమీ లేని ప్రస్తుత తరుణంలో ఆ సవాలును మనదేశం ఎదుర్కోవటం తేలిక కాదన్నారు. ఆర్థికమందగమనం మన సవాలును మరింత కష్టతరం చేస్తోందన్నారు.

పరిస్థితి ఇంత జటిలంగా వున్నా.. మనం మాత్రం ఉద్యోగాలను సృష్టించే విధానాలను మాత్రం అవలంబించ కుండా కబుర్లతో, నినాదాలతో, ఏ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుంది, ఏ నాయకుడి కొడుకు వారసుడవుతాడు వంటి పనికిమాలిన చర్చలతో కాలక్షేపం చేస్తున్నామని జేపీ అన్నారు. మన బిడ్డలకు ఉద్యోగాలు రావాలంటే కార్మిక చట్టాల్లో మార్పులు రావాలన్న వాస్తవాన్ని ప్రతి శ్రామికుడూ అర్థం చేసుకోవాలన్నారు. తాను చెప్పేది కొత్తగా అనిపించినా, అందులోని వాస్తవాన్ని, హేతుబద్ధతను గుర్తించాలన్నారు.

దీన్ని ఎదుర్కోవడానికి ఒడుపుగా, ఆచరణాత్మకంగా విధానాలను రూపొందించాలన్నారు. పారిశ్రామిక రాయితీల ప్రాతిపదికల్ని, కార్మిక చట్టాల్ని మార్చటం, ఉత్పత్తిరంగాన్ని ప్రోత్సహించటం, నైపుణ్యమున్న విద్యనందించటం ఇందులో కీలకమన్నారు. ఆదాయాలు పెరగటంతో వస్త్రరంగంలో చైనా వారు వదిలేసిన ఉద్యోగాలను పొరుగున ఉన్న బంగ్లాదేశ్, వియత్నాం వంటివి వేగంగా అందుకుంటుంటే, పత్తి, జనుమును పండించే మనదేశం మాత్రం ఉద్యోగాల అవసరం భారీగా ఉన్నా తగినరీతిలో స్పందించలేకపోతోందన్నారు. మన విధానాల లోపమే మన యువత నిరుద్యోగానికి ప్రధాన కారణమన్నారు.

### చంద్రబాబు స్పందించకపోవటం అమానుషం

రాష్ట్రంలో లక్షలాది మందికి ఉద్యోగాలను సృష్టిస్తానని చెబుతున్న చంద్రబాబు.. ప్రత్యక్షంగా 6వేలు, పరోక్షంగా 15వేల మందికి ఉపాధి కల్పిస్తున్న చిట్టివలస జ్యూట్ కర్మాగారం మూతపడినా పట్టించుకోకపోవటం ఆశ్చర్యకరమని జేపీ అన్నారు. కనీసం ఏం జరిగింది? ఫ్యాక్టరీ తెరవడానికి ఏం చేద్దాం? అని ఒక సమావేశాన్ని కూడా నిర్వహించకపోవటం అమానుషమన్నారు. యాజమాన్యం చేత ఫ్యాక్టరీని తెరిపించలేని పక్షంలో.. చిట్టివలస జ్యూట్ ఫ్యాక్టరీ ఆస్తుల్ని విక్రయించి కార్మికులకు చెల్లించవలసిన వంద కోట్లు ఇవ్వాలన్నారు. ప్రతి బిడ్డకూ సరైన విద్య, ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం

### యంత్రాల మీద పెట్టుబడి పెట్టేవారిని విదేశాలకు వెళ్లిపొమ్మనండి

చాలామంది పెట్టుబడిదారులు మన కార్మిక చట్టాల వల్ల కావచ్చు, ఇతరత్రా కారణాల వల్ల కావచ్చు.. యంత్రాల మీద పెట్టుబడి పెట్టి తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలను ఆర్జించాలనుకుంటున్నారని జేపీ అన్నారు. "యంత్రాల మీద పెట్టుబడి పెట్టేకాడికి, వారి పరిశ్రమల్ని అమెరికాలోనో, జర్మనీలోనో పెట్టుకోమనండి. మనకెందుకు దండగ! వాళ్ల పరిశ్రమల కోసం భూములు, ఇతరత్రా సదుపాయాలు కల్పించి మనం హైరానాపడటమెందుకు? వాళ్లు మన బిడ్డలకు ఉద్యోగాలు కల్పిస్తామంటేనే.. ఇక్కడి ప్రభుత్వాలు రాయితీలు కల్పించాలి. కానీ మన ప్రభుత్వాలు ఈ దిశగా చిత్తశుద్ధితో ప్రయత్నం చేయటం లేదు. ఇచ్చే ఉద్యోగాలకు, ఇస్తున్న రాయితీలకు పొంతన లేకుండా విధానాలను అమలు చేస్తున్నారు. మనకు చేస్తున్న మేలుకంటే వ్యక్తిగత లబ్ధి పొందుతున్న పెట్టుబడిదారులకు కూడా రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. ఉద్యోగానికి ఇంతని చెప్పి పెట్టుబడి రాయితీల్ని ఇవ్వాలి" అని జేపీ అన్నారు.

### మనవాళ్లు బంగ్లాదేశ్, వియత్నాం, చైనాలలో పెట్టుబడి పెడుతున్నా పాలకులకు సిగ్గురావటంలా!

తెలుగు రాష్ట్రాల్లోకి, దేశంలోకి పెట్టుబడులను తెగ కష్టపడి ఆకర్షిస్తున్నామని పాలకులు చెబుతున్నారని, కానీ మనదేశానికి చెందిన సమర్థ పారిశ్రామికవేత్తలు బంగ్లాదేశ్, వియత్నాం వంటి పొరుగుదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని జేపీ అన్నారు. మన విధానాలు, పాలనా యంత్రాంగం పనితీరు అధ్వాన్నంగా ఉండటం వల్లే మన పెట్టుబడులు విదేశాలకు వెళ్తున్నాయని కళ్లెదుట కనిపిస్తున్నా.. అవినీతి నిర్మూలనకు, నాణ్యమైన విద్యకు, యువతలో నైపుణ్యాల పెంపునకు, ఉపాధి చట్టాల సవరణకు మన నేతలు ఇంకా కనీస చర్యలు తీసుకోవటం లేదని దుయ్యబట్టారు.

అందిస్తే ఉపాధి కోసం యువత బెంబేలెత్తాల్సిన అవసరం ఉండదని, ప్రతి ఒక్కరూ జీవన భద్రతతో తలెత్తుకుని ధీమాగా బతకగలరని, అందుకోసం ఆయా రంగాల్లో చేయాల్సిన మౌలికమైన మార్పుల్ని ప్రజల్లో చర్చనీయాంశం చేసేందుకు, సాధించేందుకే పార్టీలకతీతంగా సురాజ్య యాత్రను చేపట్టానని జేపీ తెలిపారు.

### విద్యామంత్రి సొంత నియోజకవర్గంలోనైనా స్కూళ్లను బాగుచేశారా?

భీమిలి నియోజకవర్గం నుంచి ఎన్నికై విద్యామంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు ఎన్ని పాఠశాలలకు సౌకర్యాలు కల్పించారో, విద్యాప్రమాణాలను మెరుగుపరిచారో చెప్పాలని జేపీ ప్రశ్నించారు. ఒక వ్యక్తి ఐదేళ్ల క్రితం ఒక పార్టీలో, మూడేళ్ల క్రితం మరో పార్టీలో, మూడు నెలల క్రితం ఇంకో పార్టీలో ఉండటం చూస్తున్నామని అన్నారు. ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీలో గంటా ఉంటారన్నారు. ఈ ఫిరాయింపులు ఎంత ఘోరంగా ఉన్నాయో నంద్యాల ఉప ఎన్నికలోనూ చూశామన్నారు. ఇలాంటి రాజకీయంలో ఏ పార్టీ గెలిస్తే ఏముంది? తేడా ఏముంటుంది? ప్రజలకు ఒరిగేదేముంది? అన్నారు. సురాజ్య యాత్రకు మౌత్ పబ్లిసిటీ పరంగా, ఇతరత్రా ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని, రాష్ట్రంలో, దేశంలో పాలన మెరుగుపడేందుకు దోహదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### శ్రీలంక నుంచి వచ్చి మనకు ఉపాధి కల్పిస్తున్నా తగిన తోడ్పాటు లేదు

మనదేశానికి చెందినవారు విదేశాలలో పెట్టుబడులు పెడుతున్న తరుణంలో శ్రీలంక నుంచి వచ్చిన ఎంటర్‌ప్రెన్యూర్ విశాఖ అచ్యుతాపురం సెజ్‌లో బ్రాండిక్స్ పేరుతో కంపెనీని పెట్టి చిన్న ఉద్యోగాల ద్వారానైనా మన యువతకు, మహిళలకు ఉపాధిని కల్పిస్తున్నారని జేపీ అన్నారు. ఇటీవల ఆ పరిశ్రమను తాను సందర్శించినప్పుడు వారు చెప్పిన ఫిర్యాదులు విని ఆవేదన చెందాల్సి వచ్చిందని అన్నారు. రోడ్లు, ట్రాఫిక్ సమస్యలు వంటి మౌలిక వసతులకు సంబంధించిన చిన్న చిన్న అంశాల్లో సమస్యల్ని పరిష్కరించమని వారు అభ్యర్థిస్తే.. సర్వే అని, సమీక్ష అని కాలయాపన చేస్తున్నారు తప్ప వెంటనే చర్యలు తీసుకోవటం లేదన్నారు. విదేశాల నుంచి వచ్చిన పరిశ్రమల్ని కాపాడుకోవటం, చిట్టివలస జ్యూట్ మిల్లు వంటివి మూతపడకుండా చూడటం చేయకుండా.. కొత్త పరిశ్రమల గురించి ప్రగల్భాలు, ప్రచారం ప్రభుత్వానికి అలవాటైపోయిందన్నారు.

ఏసీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ ఫ్యాక్టరీ సమస్యను కుళ్లబెట్టటం వల్లే కార్మికులు అధోగతి పాలయ్యారన్నారు. కార్మికులకు సహాయం చేసేందుకే జేపీ సాయం కోరుతున్నామన్నారు.

దీనిపై జేపీ స్పందిస్తూ, ఉద్యోగాల కల్పనలో భాగంగా ఈ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దిశగా తన వంతు సాయం తప్పక అందిస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ప్రతినిధులు, లోక్‌సత్తా మలిదశ (2.0) ఉద్యమ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పీఏసీఎస్ ఛైర్మన్ అక్కరమాని రామునాయుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు బాబూరావు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, ఏసీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కె.సునీత, బ్యాంకు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ★



# ముందు మీ గురించి ఆలోచించుకోండి .. తర్వాతే జూనియర్ ఎన్టీఆర్, నాగార్జున కొడుకు, కోహ్లీ గురించి!

"మీ పేరు మీద ఏటా ప్రభుత్వం ఎంత ఖర్చు పెడుతోందో తెలుసా?" అని సురాజ్య యాత్రలో భాగంగా విజయనగరం జిల్లాలోని ఓ సమావేశంలో జేపీ అడిగిన ప్రశ్నకు.. "మాకు అంత తెలివిలేదు సార్" అని కొందరు యువత సమాధాన మిచ్చారు. అక్కడే ఉన్న కొందరు పెద్దవాళ్లు, మహిళలు కూడా "మా సమాధానం కూడా అదే" అన్నట్టు తలపంకించారు. జనాల ఆలోచనాశక్తిని రకరకాలుగా పాలకులు ఎలా అణచివేస్తున్నారో గ్రహించిన జేపీ.. వాస్తవాల్ని ప్రజలకు వివరించి చెప్పారు.

"మీకు తెలివి లేక కాదు. తెలివి ఉంది. కానీ మీరు దాన్ని మీకోసం కంటే ఇతరుల కోసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఎన్ని కోట్లు వసూలు చేసింది, వంద కోట్ల క్లబ్‌లో చేరిందా? నాగార్జున కొడుకు పెళ్లి ఎలా జరిగింది? కోహ్లీ ఆస్ట్రేలియా టీ 20లో డకౌట్ అవడానికి ముందు రోజు ఏం చేశాడు?.. ఇలాంటి అంశాలకు మీ తెలివంతా ఉపయోగిస్తే, మీరు చేయాల్సిన పనులకు ఇంక తెలివి ఎక్కడుంటుంది?

మీ సరదాలను వద్దనటం లేదు. కానీ మీ సరదాలకు కేటాయించే సమయంలో కనీసం పదో వంతును మీ చుట్టూ ఏం జరుగుతోంది? ఎలాంటి పాలన అందుతోంది? అని ఆలోచించటానికి కేటాయించండి. చాలు. వాస్తవాలను, పరిష్కారాలను అవగాహన చేసుకుని చిన్న చిన్న ప్రయత్నాల్లో భాగమవ్వండి. ఒక్కసారి ఆ ఫలితాలు చూశాక మీరే అంటారు.. ఇప్పటిదాకా చాలా సమయం వృథా చేసుకున్నాము, ఇంకొంచెం సమయం పాలనలో మార్పుల కోసం ఇస్తాం అని! ఇదీ సురాజ్యం! మీలో ఈ అవగాహనను పెంచేందుకు, మిమ్మల్ని ఇలా సమాజహితంలో స్వచ్ఛందంగా భాగస్వాముల్ని చేసేందుకే ఈ సురాజ్య యాత్ర" అని జేపీ పేర్కొన్నారు.

కేంద్రంలో అదనంగా పెట్టే సుమారు రూ. 10,000 ఖర్చు అలా ఉంచితే.. ప్రభుత్వాలు ప్రతి పౌరుని మీదా ఏటా రూ. 30,000 వరకూ ఖర్చు చేస్తున్నాయని జేపీ తెలిపారు. ఈ డబ్బంతా అమరావతి నుంచి ఆదేశాలతోనే ఖర్చవుతుందని,

### సున్నాలు మర్చిపోతే ఎలాగయ్యా! ఇదేమన్నా చిన్న విషయమా?

ఒక్కో పౌరుడి మీద ఏటా రూ. 3,000 రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తుందనుకుంటే, మీ ఊరికి ఎంత రావాలి? అని జమ్మాదేవిపేటలో ఒక యువకుడ్ని జేపీ ప్రశ్నించారు. అతను సున్నాలు సరిగా లెక్కేయకుండా జవాబివ్వటంతో లక్షలు కాస్తా వేలయ్యాయి. సున్నాలు మర్చిపోతే ఎలాగయ్యా, ఇదేమన్నా చిన్న విషయమా? అని జేపీ అనగానే సమావేశంలో నవ్వులు విరిశాయి.

### మా ఊరిలో 2,000మంది ఓటర్లున్నారు

మీ ఊరి జనాభా ఎంత? అని జేపీ అడగగానే 'మా ఊళ్లో 2,000మంది ఓటర్లున్నారు' అనే జమ్మదేవిపేటలో వయసు మీరినవారు సహా పలువురు చెప్పారు. ఓట్లు, ఎన్నికలు తప్ప సమాజం గురించి ఆలోచనే ఉండదటయ్యా అని జేపీ వ్యాఖ్యానించగానే కార్యక్రమంలో సిగ్గు నుంచి మొగ్గ తొడిగిన ఆలోచన మెరిసింది.

## శ్రీమతి తిడుతున్నా వచ్చింది జనహితం కోసమే

లోక్‌సత్తా ఉద్యమ కృషిలో భాగంగా రాజకీయ, పాలనా, సామాజిక సంస్కరణల కోసం తాను నెలకి 30రోజుల పాటు తిరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయని, కలెక్టర్‌గా చేసిన కృషిని అలావుంచితే గత రెండు దశాబ్దాలకుపైగా కేవలం భారతదేశంలో మార్పుల కోసమే తెలుగు రాష్ట్రాల కేంద్రంగా నిర్విరామంగా పనిచేశానని జేపీ అన్నారు. 2014లో లోక్‌సత్తాకు ఓట్లు, సీట్లు రాకపోయినా తన కృషిని ఆపలేదని, రాజకీయాలకతీతంగా కొనసాగిస్తూనే ఉన్నానని తెలిపారు. వివిధ అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్దిష్ట సూచనల్ని, విధానాల్ని రూపొందించి అందిస్తున్నానన్నారు. పాలకులు అడగకపోయినా కొన్నిసార్లు ప్రజలకు ఉపయోగపడే అంశాలపై లేఖలు రాస్తున్నానన్నారు. కొంత అలసటగా అనిపించినా 100 రోజుల సురాజ్య యాత్రను ప్రారంభించానన్నారు. ఇన్ని దశాబ్దాలుగా కష్టపడుతున్నారు, ఎందుకొచ్చిందీ భారం అని తన శ్రీమతి తిడుతున్నా యాత్రను కొనసాగించటానికి కారణం.. కేవలం ప్రజల ప్రయోజనాలను పరిరక్షించాలన్న తపనేనని జేపీ అన్నారు. పెద్దపెద్ద మార్పులు రావటానికి కొన్నేళ్లు పట్టవచ్చేమోగానీ, సురాజ్య యాత్రలో ఎంపిక చేసుకున్న ఆరు అంశాలలో మార్పుల్ని ఖర్చు లేకుండా, ఏ పార్టీ విభేదించాల్సిన అవసరం లేకుండానే సాధించవచ్చని, ఇవి అమల్లోకి వస్తే కోట్ల మంది బతుకులు కుదుటపడతాయని తెలిపారు. భావితరాలకు భరోసా ఏర్పడుతుందన్నారు. ఈ లక్ష్యం లేకపోతే హాయిగా ఇంట్లో విశ్రాంతి తీసుకునేవాడినని, కేవలం జనహితమే తనను నడిపిస్తున్న శక్తి అని వివరించారు. సురాజ్య యాత్ర ద్వారా స్థానికంగా కొందరు నాయకులు తయారైతే, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ వేదికల ద్వారా ముమ్మందు కూడా అందుబాటులో ఉండి సురాజ్య కార్యక్రమాలను సమన్వయం చేస్తానని, ఇది దీర్ఘకాలిక పోరాటమని జేపీ స్పష్టంచేశారు.

జమ్మాదేవిపేట, తగరపువలస, మంగళాపురంలో ఏం చేయాలో ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాల్లో నిర్ణయిస్తారని అన్నారు. అందుకే విజయనగరం జిల్లా గ్రామాల్లో వివాదరహితమైన సమస్యల పరిష్కారానికి కూడా ఏళ్లు పడుతోందని, చేసిన పనుల్లో కూడా నాణ్యత లేక పరిస్థితి మొదటికొస్తోందని వివరించారు. ఇదే గనక స్థానికంగా ప్రతి ఊరుకీ 10శాతం నిధుల్ని రాష్ట్రం కేటాయిస్తే, 1000 జనాభా ఉన్న సాధారణ గ్రామానికి కూడా 30 లక్షలు వస్తాయన్నారు. ఈ డబ్బుతో స్థానిక రోడ్లను, పారిశుద్ధ్యాన్ని, పాఠశాలల్ని వెంటనే, ఎవరి సిఫార్సు కోసమో వేచిచూడకుండానే పరిష్కరించుకోవచ్చన్నారు. ఇక్కడ తప్పుజరిగితే చర్యలు తీసుకునే ఏర్పాట్లను గ్రామస్తులు, రాష్ట్ర ప్రభుత్వం కూడా చేసుకోవచ్చన్నారు. ★

### జేపీ చెప్పాడని నమ్మక్కర్లా, ఫోనుల్లో, సోషల్ మీడియాలో చర్చించి తేల్చుకోండి

ఫోన్‌లలో, సోషల్ మీడియాలో, ప్రత్యక్షంగా మాట్లాడుకునేటప్పుడు సురాజ్య యాత్ర లక్ష్యాల గురించి, వాటి తక్షణ అవసరం గురించి చర్చించుకోవాలని యువతను, ఇతర పౌరులను జేపీ కోరారు. జేపీ ఇలా చెబుతున్నారు, నిజమేనా? అని నిగ్గుతేల్చుకోవాలన్నారు. తాను చెప్పాను కాబట్టి నమ్మక్కర్లేదని, అందులోని వాస్తవాల్ని, మీ జీవితంలో వాటి వల్ల కలిగే ఉపయోగాల్ని ధృవీకరించుకున్నాకే వాటి కోసం పనిచేయాలని చెప్పారు. అయితే సమయం వృధా కాకుండా చూసుకోవాలని జేపీ సూచించారు.

# బాబ్జీ సేవలు లోక్‌సత్తాకు అవసరం



గడచిన ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో లోక్‌సత్తా పార్టీని భీశెట్టి బాబ్జీ అభినందనీయంగా నడిపించారని జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో విజయనగరం వచ్చిన జయప్రకాష్ నారాయణ్.. పదవిలో ఏడాది పూర్తి చేసుకున్న బాబ్జీకి అభినందనలు తెలిపేందుకు లోక్‌సత్తా పార్టీ నేతలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలని, తమ జీవితాలు చూసుకుంటూనే కొంత సమయాన్ని, వనరులను మంచి రాజకీయానికి కేటాయించాలని ఇచ్చిన పిలుపునందుకుని బాబ్జీ లాంటి వారెందరో లోక్‌సత్తాలో చేరారని జేపీ అన్నారు. బాబ్జీలాగా కొందరు ఎంతో ఓపికగా కొత్త రాజకీయాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లటంలో సఫలమయ్యారన్నారు. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రంలో బాబ్జీ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కొన్ని సామాజికాంశాలపై సమగ్రంగా మాట్లాడగల బాబ్జీ నాయకత్వం లోక్‌సత్తాకు అవసరమన్నారు.

కార్యక్రమంలో రామ్మోహనరావు, నాగభూషణం, ఎం.చిన్నారావు, అనంతలక్ష్మి, రమేష్, శ్రీను, రాయి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ★

# చెప్పుతో కొట్టాలనటం డ్రామానే.. అవినీతి ఉద్యోగులపై చర్య తీసుకునే ధైర్యం లేని ప్రభుత్వాలు



రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రా, తెలంగాణ పేరుతో ఉద్యోగాలను విడగొట్టి రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు జేఏసీలను ఏర్పాటు చేశారని, ఆ తర్వాత ఉద్యోగుల చేతుల్లో పాలకులు కీలుబొమ్మలుగా మారారని జేపీ అన్నారు. కొందరు అధికారులు అవినీతి అనకొండల్లా తయారవుతున్నా చర్యలు లేవన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అవినీతికి పాల్పడిన 100 మంది అవినీతి అధికారులను ఇంటికి పంపించే ధైర్యం ఇద్దరు చంద్రులకూ లేదని ముఖ్యమంత్రులనుద్దేశించి వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడ్డ ఉద్యోగులను చెప్పుతో కొట్టండి వంటి డ్రామాలతో కేసీఆర్, చంద్రబాబు కాలక్షేపం చేస్తున్నారన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా విజయనగరం జిల్లాలో జేపీ వివిధ సమావేశాల్లో, మీడియాతో మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్సయిజ్ కమిషనర్ లక్ష్మీనరసింహ ఇద్దరు అవినీతిపరులైన అధికారులపై చిన్నపాటి చర్యలు తీసుకుంటే.. వాటిని వెనక్కి తీసుకోవాలని ఉద్యోగుల సంఘాలవారు అడిగారని, ఎలాంటి పాలన నడుస్తోందని జేపీ ప్రశ్నించారు. ఏసీబీ పాలకుల కనుసన్నల్లో నడుస్తోందని, లోకాయుక్తకు కోరలు లేవని అన్నారు. ఏసీబీకి స్వయంప్రతిపత్తి ఇచ్చి లోకాయుక్త పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులతో లాలూచీ పడ్డట్టు ప్రభుత్వాలు వ్యవహరిస్తూ ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తున్నా ప్రతిపక్షాలు సహా ఎవరూ మాట్లాడటం లేదని, అందుకే తాను మాట్లాడాల్సి వస్తోందని జేపీ అన్నారు. నిజాయతీపరులైన అధికారులకు అండగా ఉండాలని, అవినీతిపరులపై చర్యలకు మనం గట్టిగా డిమాండ్ చేయాలని అన్నారు. ప్రభుత్వోద్యోగులకు రాజకీయాలతో సంబంధంలేదని, వారిని రాజకీయ ఉద్యమాలలో వేలుపెట్టనీయవద్దని విభజన ఆందోళనల సమయంలోనే తాను హెచ్చరించారనని గుర్తుచేశారు. ఉద్యోగుల జీతభత్యాలు పెంచుతూ, అవినీతి ఉద్యోగులను రక్షిస్తూ, ప్రజలకు మాత్రం ప్రభుత్వ కార్యాలయాల్లో సక్రమంగా సేవలందించకుండా తాత్కాలిక తాయిలాలు, కులం, మతం వంటి ఉచ్చుల్లోకి నెడుతూ ఎలాంటి పాలనను, రాజకీయాన్ని చేస్తున్నారు అని ప్రశ్నించారు.

జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వం కూడా ఇదే తీరుగా ఉందని జేపీ అన్నారు. దేశంలో అవినీతి లేదని మోదీ చెబుతున్నా.. ప్రభుత్వ కార్యాలయాల్లో యథేచ్ఛగా సాగుతోందన్నారు. అవినీతిలో కూరుకుపోయిన ఓ వెయ్యిమంది అవినీతిపరుల లిస్టు కావాలంటే.. వెంటనే ప్రధాని చేతికి అందుతుందన్నారు. అలాంటి వారి చేత బలవంతంగా రాజీనామా చేయించే అధికారమున్నా.. అందుకు ప్రధాని ధైర్యం చేయటం లేదన్నారు. ఈ దేశంలో అవినీతిపరులకు కులం, ధనం అండగా నిలబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో సీబీఐకి, రాష్ట్రాల్లో ఏసీబీలకు స్వయంప్రతిపత్తినిచ్చి, జవాబుదారీ చేస్తే ఈ సమస్య ఉండదన్నారు. అందుకు భిన్నంగా ఆ నేరదర్యాప్తు సంస్థల్ని పాలకులు తమ కనుసన్నల్లో పెట్టుకుంటున్నాయన్నారు.

అవినీతి నిరోధక చట్టానికి కేంద్రం తీసుకురాబోతున్న సవరణ తీవ్ర ప్రజావ్యతిరేక చర్యని జేపీ అన్నారు. దీనివల్ల చిన్న సర్టిఫికెట్ కోసం గతి లేక లంచం ఇచ్చే ప్రజలకు 3 నుంచి 7 ఏళ్ల వరకు శిక్ష పడుతుందని, అవినీతికి పాల్పడ్డ ఉద్యోగులకు మాత్రం రక్షణ లభిస్తుందని అన్నారు (రాజస్థాన్ ప్రభుత్వం ఆ తానులో గుడ్డలాగానే వ్యవహరిస్తూ.. అవినీతిపై మాట్లాడితే మీడియాకు కూడా శిక్షలు పడేలా చేస్తోందని జేపీ తిరుపతి సురాజ్య యాత్రలో విమర్శించారు). ఈ పరిస్థితిని మార్చకపోతే ప్రజల స్వరాజ్యానికి అర్థముండదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు లేకుండా, వేధింపులు, అవమానాలు లేకుండా గౌరవప్రదంగా సేవలందించేందుకు పౌర సేవల చట్టం వంటి ఎజెండాతో సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. ఈ చట్టం వస్తే, నిర్ణీత గడువులోగా ప్రజలకు పనులు చేయాలని, ఆ గడువు దాటితే రోజుకు రూ.250 పరిహారం చెల్లించాలని అన్నారు. ఇలా ప్రజలు ప్రభువుల్లా, ప్రభుత్వాలు సేవకుల్లా ఉన్నప్పుడే సురాజ్యమన్నారు. కార్యక్రమాల్లో వైబీఐ ప్రతినిధులు, భీశెట్టి బాబ్జీ, బందారు రామ్మోహనరావు, స్థానిక నేతలు కోటేశ్వరరావు, ఆర్.పద్మావతి, ఐ.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ★



తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఎదగగలిగానని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సర్కారీ స్కూలులోనే చదువుకున్నారని.. మరి ఇప్పుడు ఆ స్కూళ్లలో చదువెందుకు దిగజారిందో అన్న ఆలోచనను కూడా ఎందుకు చేయటం లేదు? అని జేపీ ప్రశ్నించారు. ప్రభుత్వాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరూ తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపటం లేదని, అయినా ముఖ్యమంత్రికి సమీక్షించే తీరికలేదని అన్నారు. ఆర్భాటంగా తెచ్చిన విద్యాహక్కు చట్టం వల్ల లాభం కన్నా నష్టం ఎక్కువ వస్తోందని, ప్రైవేటు స్కూళ్లలోకి అడ్మిషన్లు ప్రతి ఏడాదీ పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదని అన్నారు. పిల్లలకు చదువు చెప్పడానికి కూడా చట్టం తెచ్చి హడావుడి చేయడం మనదేశంలోనే కనిపిస్తుందన్నారు. తమ పిల్లలు చదువుకుని బాగా ఎదగాలని కడుపు కట్టుకునే తల్లిదండ్రులు అడుగడుగునా కనిపిస్తున్నా, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని విద్యారంగాన్ని ఇష్టమొచ్చినట్టు నడిపిస్తూ నాశనం చేస్తున్నారన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా బబ్బిలిలో గురుకుల పాఠశాలను సందర్శించిన అనంతరం జయప్రకాష్ నారాయణ్ మీడియాతో మాట్లాడారు.

పాఠశాల విద్యాప్రమాణాల్లో మనదేశం 74 దేశాల మధ్య 73వ స్థానంలో ఉందని అంతర్జాతీయ సమాజం హెచ్చరించినా పాలకులు తప్పు దిద్దుకోకుండా, అలాంటి సర్వేలను ఎలా తప్పించుకోవాలా అని ఆలోచిస్తున్నారని జేపీ అన్నారు. అటు ప్రభుత్వం, ఇటు తల్లిదండ్రులు ఇద్దరికీ చేతి చమురు వదులుతున్నా ఎంతో కీలకమైన ఓ రంగం గురించి పట్టించుకోని పాలన సుపరిపాలన అవుతుందా? అని ప్రశ్నించారు. దీన్ని మార్చేందుకే సురాజ్య ఉద్యమమన్నారు.

విద్యాహక్కు చట్టం వచ్చాక 15శాతం మంది ప్రభుత్వ స్కూళ్లలో నుంచి మానేశారని, చట్టం వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేకపోవడంతో నిరుపేదలు శక్తికి మించి ప్రైవేటు బడులలో తమ పిల్లల్ని చేరుస్తున్నారన్నారు. అక్కడా చాలాచోట్ల మంచి చదువు అందటం లేదన్నారు. సరైన చదువు లేక కొన్ని తరాలు నాశనమవుతున్నా పట్టించుకునే తీరిక మాత్రం పాలకులకు లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 38 లక్షలమంది పిల్లల కోసం రూ. 23,000కోట్లు ఖర్చు చేస్తున్నట్టు అధికారికంగా చెబుతున్నారని, అంటే తలసరి ఏటా రూ. 60,000 దాకా ఖర్చు చేస్తున్నా చదువు రావటం లేదని అన్నారు. విద్యారంగానికి సంబంధించి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, భావితరాలు క్షమించలేని నేరాన్ని పాలకులు చేస్తున్నారని పలు సందర్భాల్లో తాను చెప్పానని, గత పదేళ్లుగా కూడా అనేకసార్లు లోటుపాట్లను సరిదిద్దేందుకు సలహాలు, సూచనలు ఇచ్చానని తెలిపారు. ఇటీవల నరేంద్ర మోదీ ప్రభుత్వానికి, ఏపీ ప్రభుత్వానికి కూడా పాఠశాల విద్యను బాగు చేసేందుకు సూచనలతో నివేదికలు ఇచ్చామన్నారు. వాటి వివరాలను ఎఫ్‌డీఆర్ ఇండియా. డాటార్గ్‌లో చూడవచ్చన్నారు.

## చంద్రబాబూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు, ఇప్పుడు ఆ స్కూళ్లలో చదువెందుకు దిగజారిందో ఎందుకు ఆలోచించటంలా?

ఏపీలో సగటున 2.20లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, అంటే సగటున 1:18 నిష్పత్తిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారని జేపీ అన్నారు. దొంగ స్కూల్స్‌ని మంచి స్కూల్స్‌గా మార్చాలని, టెక్నాలజీ వినియోగం గురించి డబ్బా కొట్టుకునే చంద్రబాబు విద్యారంగాన్ని బాగుచేసేందుకు ఆ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. విద్యతో సమాజం బాగుపడుతుంది తప్ప యజ్ఞయాగాదులతో కాదని చంద్రబాబు, కేసీఆర్ గుర్తించాలన్నారు. డీమానిటైజేషన్‌ను అసమర్థంగా అమలుచేయటం దేశప్రజల పాలిట శాపంగా మారిందని, నల్లధనం వెలికితీతకు మరిన్ని సంస్థాగత చర్యలు కావాలని, ఆ వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ తెలిపారు. ★

# ఈతరానికి అద్భుతావకాశాలున్నాయి.. నాసిరకం చదువు, పాలనలే అవరోధాలు!




ప్రపంచం వేగంగా ఆధునికమవుతోందని, కానీ ఆ ఆధునికతకు తగ్గట్టు మన యువత ఎదగలేకపోవడానికి మన రాజకీయం, పాలనా విధానాలే కారణమని డా|| జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సాంకేతికత పెరిగినంత వేగంగా మన జీవితాల్లో, ప్రవర్తనలో, సమాజంలో మార్పులు రావడం లేదన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన విజయనగరం జిల్లా కొత్తవలస తుమ్మికాపల్లి వల్ల గల వాగ్దేవి విద్యాసంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గన్నారు.

ప్రతి తరం తమ ముందు తరంకంటే ఎక్కువ సామర్థ్యాన్ని కలిగివుంటుందని, తమ భుజాల మీద నిలబడి ఉండటం వల్ల తమ తర్వాతి తరం ఎక్కువ దూరం చూడగలుగుతుందని జేపీ అన్నారు. తాము ఎన్నో ఏళ్లు నేర్చుకున్న విషయాలను ఇప్పటితరం తేలిగ్గా కొద్దికాలంలోనే నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటి మొబైల్ టెక్నాలజీ వల్ల అమెరికాలోని ఎంఐటీ విద్యార్థులు, ఢిల్లీలోని ప్రధానమంత్రికి తెలిసిన సమాచరం ఓ సామాన్య కుటుంబంలోని విద్యార్థికి కూడా తెలుస్తుందన్నారు. కానీ సరైన పాఠశాల విద్య, సామాజిక పరిణితిలేని పెద్దరికాల వల్ల కొత్త తరంలోని అత్యధికులు వెనకబాటుతనంలోనే ఉన్నారన్నారు.

తమ తరంలో ఊహించనన్ని వేలరూపాయలను ఈవేళ ఒక్కో విద్యార్థి మీదా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఖర్చు చేస్తున్నారని, అయినా వారికి సొంతంగా ఆలోచించి వ్యవహరించగలిగే చదువు అబ్బటం లేదని జేపీ అన్నారు. సైన్స్, విశ్లేషణా సామర్థ్యం, గణితంలో సత్తా ఆధారంగా హైస్కూలు విద్యార్థుల మధ్య 74 దేశాల మధ్య నిర్వహించిన అంతర్జాతీయ సర్వేలో మనదేశం 73వ స్థానంలో ఉందన్నారు. ఆ తప్పుని దిద్దుకోవాల్సిందిపోయి, ఆ సర్వే (పీసా)లోనే పాల్గనబోమని భారత్ ఉక్రోషంతో బైటికొచ్చిందన్నారు. ఈ అంశాన్ని తాను విస్తృతంగా ప్రచారం చేశానన్నారు. వివిధ దేశాల మధ్య నగుబాటు కావడం వల్లో ఏమో ఈమధ్య మళ్లీ పీసా సర్వేలో చేరతామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇలాంటి స్కూలు విద్య వల్ల ఆ తర్వాత పెద్ద డిగ్రీలు సంపాదించినా తగిన సామర్థ్యం యువతకు సమకూరటం లేదన్నారు.

దీనికితోడు పాతతరానికి, కొత్తతరానికీ మధ్య అంతరాన్ని తగ్గించే ఆధునిక ప్రజాస్వామిక ధోరణులు, విధానాలు పాలకుల్లో లోపించాయని జేపీ పేర్కొన్నారు. విద్య, విద్యుత్, శిశుమరణాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక రంగాల్లో 57 అభివృద్ధి చెందిన దేశాల మధ్య మనదేశం 55వ స్థానంలో ఉందన్నారు. పేరుకు న్యూ ఇండియా అంటున్నా.. ప్రస్తుత పాలకులూ నవ భారత నిర్మాణానికి కృషి చేయటం లేదన్నారు. మూర్ఖపు విద్యతో, సామాజిక కట్టుబాట్లతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారన్నారు.

నైతికత, నైపుణ్యం గల విద్యను అందించేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని జేపీ కోరారు. ఇందులో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న నూతన సాంకేతిక మార్పుల్ని ఒడిసిపడుతూ ఆత్మవిశ్వాసంతో ఎదగాలని సూచించారు. మార్కులూ, ర్యాంకులే చదువు కాదన్నారు. చదువుతోపాటు సమాజంలోని పరిణామాలను పట్టించుకోవాలని, అన్యాయాల్ని సరిచేయాలని అన్నారు. చదువును, కెరీర్‌ను చూసుకుంటూనే యువత సామాజిక మార్పులో భాగస్వాములయ్యేందుకే "యూత్ ఫర్ బెటర్ ఇండియా" వెబ్ ప్లాట్‌ఫాంను అందిస్తున్నామని, ఇందులో విద్యార్థులు, వివిధరంగాల యువతీయువకులు నమోదు

## విద్యార్థుల ప్రశ్నలకు జేపీ జవాబులు

సమావేశంలో విద్యార్థులు, కొందరు అధ్యాపకులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబిచ్చారు.

**ప్రీతి (బీఎస్సీ ప్రథమ సంవత్సరం): సామాన్య ప్రజలు కోర్టుకి వెళితే సంవత్సరాల తరబడి తిరుగుతున్నారు. దీనివల్ల న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుంది. న్యాయవ్యవస్థలో ఎలాంటి మార్పులు రావాలి?**

జేపీ: కొన్నేళ్లపాటు నేను చేసిన పోరాటం వల్ల 2009లో స్థానిక న్యాయస్థానాల చట్టం వచ్చింది. దీంతో ఏళ్ల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండానే చిన్నచిన్న నేరాల్లో న్యాయం జరిగే అవకాశం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. కానీ ఈ చట్టాన్ని అమలుచేసే ప్రయత్నం దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరగటంలా. తప్పు చేసినప్పుడు శిక్షలు సకాలంలో పడాలి. అలాగే ఉన్నత న్యాయస్థానాల్లో నియమించే న్యాయమూర్తుల ఎంపిక సరిగ్గా ఉండేలా చేసేందుకు 99వ రాజ్యాంగ సవరణగా జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని లోక్‌సత్తా సాధించింది. పార్లమెంటు ఆమోదించినా, పలు రాష్ట్రాల శాసనసభలు ధృవీకరించినా ఇది అమల్లోకి రాలేదు. వీటితో పాటు సమర్థులైన న్యాయమూర్తులు వచ్చేందుకు అఖిల భారత పరీక్ష, న్యాయమూర్తుల జవాబుదారీతనానికి ఏర్పాట్లు, పోలీసు సంస్కరణలు వంటివి కూడా వస్తేనే న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, సమర్థవంతంగా ఉంటుంది. అందరికీ తేలిగ్గా న్యాయం అందుతుంది. ఇందుకోసం ఓ పక్క పైస్థాయిలో కృషి చేస్తూనే, మరోపక్క వీటిని ప్రజల డిమాండ్‌గా మార్చేందుకు ప్రచార కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నాం.

**ఈశ్వరమ్మ (డైట్ విద్యార్థిని): రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వాలు చెప్పే కారణాలు సమంజసమేనా?**

జేపీ: వ్యవసాయం ఒక వేటలా తయారైంది. యంత్రాలు వచ్చిన తర్వాత వ్యవసాయం పాత్ర తగ్గింది. జాతీయ సంపదలో వ్యవసాయం వాటా ప్రతి దేశంలోనూ తగ్గుతూ వస్తోంది. కానీ మనదేశంలో వ్యవసాయం మీద అత్యధికులు ఆధారపడి ఉన్నారు. కాబట్టి దీన్ని ఆహారోత్పత్తితోపాటు ఉపాధి సృష్టి, ఆదాయాల పెంపులో భాగంగా కూడా చూడాలి మనం. కానీ కనీస ఆలోచన, మానవత్వం కూడా లేకుండా.. మనదేశంలో రైతులు పండించే పంటలను డిమాండ్ ఉన్న ఇతర ప్రాంతాల్లో అమ్ముకోకుండా కూడా నిషేధించారు మన పాలకులు. పైకి మాత్రం రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక వంటి కపట నినాదాలిస్తారు. వ్యవసాయ రుణాలు, ఉచిత విద్యుత్ వంటి పనికిమాలిన హామీలు రైతులను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఓట్ల వేట తప్ప.. రైతుల సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఏ కోశానా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కనిపించటం లేదు.

**మృత్యుంజయరావు (డైట్ కాలేజీ): నేటి విద్యావ్యవస్థలో ఎంఈవో, డీఈవో పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయకపోవటం వల్ల విద్యాప్రమాణాలు తగ్గుతున్నాయన్న వాదనల్లోని నిజానిజాలు?**

జేపీ: పూర్వకాలంలో విద్యావ్యవస్థలో పర్యవేక్షణ చేసేందుకు ఇన్‌స్పెక్టర్ అనే అధికారి ఉండేవారు. వారు స్కూలును సందర్శించి బేరీజు వేసేవారు. దీంతో ఉపాధ్యాయులు కూడా పనితీరును మెరుగుపరచుకునేవారు. నేడు అటువంటి వ్యవస్థ లేదు. ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయకుండా డిప్యుటేషన్ల మీద నడుపుతుండటంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోంది.

చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర పౌరులు “సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా” ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో చేరి సమస్యల్ని పరిష్కరించుకోవచ్చన్నారు.

సమాజాన్ని బాగుచేసేందుకు పునాది లాంటి విద్య/ఉపాధి, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, అవినీతిరహిత సేవలు, స్థానిక సాధికారత, లాభసాటి వ్యవసాయం అనే ఆరు లక్ష్యాల కోసమే సురాజ్య యాత్రను ప్రారంభించామని, దీనికి పార్టీలకతీతంగా అన్ని వర్గాలూ మద్దతివ్వాలని, మేధావులు మౌనం వీడి సమాజంలో సురాజ్య మార్పు కోసం కలిసిరావాలని జేపీ కోరారు.

కార్యక్రమంలో లోక్‌సత్తా మలిదశ (2.0) ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, డైట్ కళాశాల ప్రిన్సిపల్ మృతుంజయరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఈ కుమార్‌బాబు, కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు, ఉపాధ్యాయులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ★





# ప్రభుత్వం ఓ రూ.2,000 ఖర్చు పెడుతుందను కుంటున్నాం సార్!

'మీలో ఎంతమంది మీ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లలో చదివిస్తున్నారు?' అని జేపీ అడగగానే సభకు హాజరైనవారిలో పలువురు చేతులెత్తారు.

కొంతమందిని స్కూళ్ల పేర్లు అడిగారు.

ఆ తర్వాత ఎంత ఫీజు చెల్లిస్తున్నారు అని ఆరాతీశారు.

మీ పక్క ప్రాంతాల్లో బడి ఫీజులు ఎలా ఉన్నాయి అని జేపీ మళ్లీ ప్రశ్నించారు.

.. మొత్తంగా ప్రైవేటు స్కూళ్లకు పిల్లల్ని పంపే తల్లిదండ్రులు ఏడాదికి రూ. 10,000- రూ.30,000 దాకా కడుతున్నట్టు తేలింది.

మరి ప్రభుత్వం ఒక్కో విద్యార్థి పేరు మీదా ఏడాదికి ఎంత ఖర్చు చేస్తుందో తెలుసా? అని జేపీ మళ్లీ అడిగారు.

ఎవరు చెబుతారు అంటూ అన్ని దిక్కులకూ చూశారు.

ముందు వరసలో ఉన్న మహిళలు చెప్పాలా, వద్దా అని సందేహిస్తూ మౌనం వహించారు.

కానీ ఒకావిడ ధైర్యం చేసి చెప్పింది.. రూ.2000 అనుకుంటున్నాం సార్ అని.

మీరేమంటారు? అని పురుషుల వైపు చూసి జేపీ మళ్లీ ప్రశ్నించటంతో.. కొంతమంది మధ్యతరగతి మధ్యవయస్కులు, యువత గొంతు విప్పారు.

ఆమె చెప్పింది కరెక్టే అనుకుంటున్నాం సార్, ప్రభుత్వం ఓ రెండు వేలు దాకా ఖర్చు చేస్తుండొచ్చు అన్నారు.

కాస్త గుండె దిటవు చేసుకోండి.. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి ఒక్కో బిడ్డ స్కూలు చదువుకు రూ.60,000 దాకా ఖర్చు చేస్తోంది.. అని జేపీ చెప్పగానే అక్కడున్నవారంతా అవాక్కయ్యారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా విజయనగరం పట్టణం వీటీ అగ్రహారంలో జరిగిన సభలో దృశ్యమిది.

విద్యపై ప్రభుత్వం ఖర్చుకు, వస్తున్న ఫలితాలకు పొంతన లేని ఫలితాలు వస్తున్నాయని సురాజ్య యాత్రలో భాగంగా అనేక సమావేశాల్లో తాను చెబుతూ వస్తున్నానని, వినీవినీ బోర్ కొడుతుందేమోనని కొందరు యూత్ ఫర్ బెటర్ ఇండియా, లోక్‌సత్తా వలంటీర్లు, నేతలు సందేహిస్తున్నారని, కానీ ఈ వాస్తవాలు ఇంకా చాలామందికి చేరాల్సి ఉందని ఈ సమావేశం రుజువు చేస్తోందని జేపీ అన్నారు. చేరినవారికి కూడా మనసుల్లోకి ఇంకి కార్యాచరణగా మారాల్సి ఉందని, అందుకే మార్పు వచ్చేదాకా మళ్లీ మళ్లీ చెప్పాలని, మీడియా ఇంకా ఇంకా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

స్వరాజ్యం అసంపూర్ణంగా, దొంగ స్వరాజ్యంగా ఉందని, దాన్ని మార్చేందుకే సురాజ్య ఉద్యమ యాత్రను చేస్తున్నామని జేపీ వివరించారు. సురాజ్యం అంటే, మనం కడుతున్న పన్నుల డబ్బుతో, మనకు కావలసిన విద్య, వైద్యం, ఉపాధి, రక్షణ, వసతులు లంచాలు, వేధింపులు లేకుండా అందించటమన్నారు. వ్యవసాయంలో ఉన్నవారికి ఆదాయం అందించటమన్నారు. ఇది చేయకుండా ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతూ మిల్లుల్ని మూసివేయటం, కుటుంబ పోషణ కోసం పిల్లల్ని కూలీలుగా మార్చే విధానాలను అమలు చేయటం చేస్తున్నారన్నారు. విజయనగరంలో ప్రభుత్వ వైద్యకళాశాల కోసం చాలాకాలంగా లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. సురాజ్యాన్ని సాధించుకోవాలంటే ప్రజలు కట్టే పన్నులు, ప్రభుత్వం చేస్తున్న ఖర్చుల లెక్కలపై, విధానాలపై కాస్త అవగాహన పెంచుకుని లక్ష్యాల కోసం కలసికట్టుగా ప్రయత్నిస్తే చాలన్నారు. సమావేశంలో ఆంధ్రచైతన్య పార్టీ నేతలు, రామ్మోహనరావు, బాబ్జీ, నాగభూషణం, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ★

# వాడు వీడ్ని తిట్ట, వీడు వాడ్ని తిట్ట, ఎన్నికల్లో డబ్బు ఖర్చుబెట్ట.. ఈ రాజకీయం గురించా మనం మాట్లాడుకోవాల్సింది?

**వా**డు వీడ్ని తిట్ట, వీడు వాడ్ని తిట్ట, ఎన్నికల్లో డబ్బులు ఖర్చుబెట్ట.. ఈ స్థాయికి దిగజారిన రాజకీయం గురించే మనం పట్టించుకుంటున్నాం తప్ప, ఏ పార్టీ వచ్చినా మన బతుకులు ఎందుకు పెద్దగా మారటం లేదు? అని ఆలోచించటం లేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం జమ్మాదేవి పేటలో ఆయన యువత, రైతులు, మహిళలతో సమావేశమయ్యారు. పలు సమస్యలపై చర్చించారు.



## డబ్బు తరిగే విలువ, భూమి పెరిగే విలువ జిందాల్, కేసీపీల అన్యాయం రైతులకు పునరావృతం కాకూడదు

సిమెంట్ పరిశ్రమ పెడతాం, ఉద్యోగాలిస్తాం అని తమ భూముల్ని కేసీపీ సంస్థ కొన్నేళ్ల క్రితం తీసుకుందని, ఇప్పటికీ పరిశ్రమ పెట్టలేదని బోజంకి సత్యవతి అనే మహిళ జేపీ దృష్టికి తెచ్చారు. తనకు భూమి పోయింది, ఉపాధి రాలేదని వాపోయింది. అలాగే జిందాల్ సంస్థ అల్యూమినియం ఫ్యాక్టరీ పెడతామని నామమాత్రపు పరిహారంతో భూముల సేకరణ చేసిందని, ఆ పరిహారంలో కూడా కొందరు రాజకీయ నేతలు, అధికారులు వాటాలు పంచుకుని మోసం చేశారని రైతులు ఫిర్యాదు చేశారు. తమకు ఉపాధి లేక రోడ్డునపడ్డామని, దీనిపై లోక్‌సత్తా చాలా పోరాటం చేసి లోకాయుక్త చేత కూడా ఆదేశాలు జారీ చేయించిందని, ఈ పోరాటాన్ని కొనసాగించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. రైతుల పక్షాన లోక్‌సత్తా పార్టీ పరంగా చేస్తున్న కృషిని పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఈ సందర్భంగా వివరించారు.

తమకు ఉపాధి, తమ పిల్లలకు చదువు, భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు ఉంటాయనే ఆశతో తమకెంతో విలువైన భూముల్ని రైతులు, గ్రామీణులు ప్రభుత్వాలకు అప్పగిస్తున్నా.. సరైన విధానాలు లేకపోవడం, దోపిడీ రాజకీయం, పాలన వల్ల నష్టపోతున్నారని జేపీ అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు లోక్‌సత్తా వ్యతిరేకం కాదని, కానీ వాటి స్థాపనకు తీసుకున్న భూములలో రైతులకు కొంత వాటా కూడా ఇవ్వాలన్నారు. రైతులకు పరిహారంగా కేవలం డబ్బు చెల్లిస్తే చాలదన్నారు. డబ్బుది తరిగే విలువ, భూమిది పెరిగే విలువ అని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమ కోసం సేకరించిన భూమిని అభివృద్ధి చేసి, అందులో రైతులకు, భూయజమానులకు కూడా కొంత వాటా ఇస్తే న్యాయం జరుగుతుందన్నారు. అవసరమైతే ఇందుకోసం అదనంగా కొంతభూమిని సేకరించవచ్చన్నారు. జిందాల్, కేసీపీ బాధితులకు తొలి నుంచి తాము అండగా ఉన్నామని, ఈ సమస్యపై ఇప్పటికే ముఖ్యమంత్రికి కూడా వివరంగా లేఖ రాశామని, తగు చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని జేపీ రైతులకు హామీ ఇచ్చారు. ఇలాంటి అన్యాయం రైతులకు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## ఓటు సరిగా వేయకపోతే అంతే తల్లీ!

సురాజ్య యాత్రలో భాగంగా తమ గ్రామానికి వచ్చిన జేపీకి కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తమ ఊళ్లో కనీసం మంచినీరు కూడా అందని దుస్థితి ఉందని సమస్యల్ని ఏకరువు పెట్టారు. ఇనాం చట్టం పేరుతో అక్రమాలను వివరించారు. రెండు పంచాయతీల వివాదంతో అభివృద్ధి కుంటుపడినా పట్టించుకునేవారు కరవయ్యారన్నారు. ఓటుకు నోటు, మద్యం తీసుకోవటమో, ప్రలోభాలు, ఉద్రేకాలకు లోనై ఓటు వేయటమో చేసి అవినీతిపరులను, అసమర్థులను ఎన్నుకుంటే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఏకరువు పెడుతున్న మహిళలను జేపీ ప్రశ్నించారు. ఓటు బ్రహ్మాస్త్రమన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటే ఈపాటికే సరైన నేతలు అధికారంలోకి వచ్చి ప్రజల కష్టాలు చాలావరకు తీరేవన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల వైఖరి, పనితీరుపై కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. మంచినీరు, రోడ్లు, చిన్న చిన్న అభివృద్ధి పనులు వంటి అంశాల్ని కూడా చేయలేని రాజకీయాన్ని, పాలనను మనం పెంచి పోషిస్తున్నందునే, ప్రజల్లో చైతన్యానికి, పరిష్కారాలు వేగంగా సాధించడానికే సురాజ్య యాత్రను చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూలోక, భీశెట్టి బాబ్జీ, బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ నేతలు ఐతంశెట్టి శ్రీనివాస్, ప్రసాద్, ఎస్వీ నాగేశ్వరరావు, దొడ్డి నాగార్జున, మళ్ల సత్యనారాయణ, అప్పారావు, రాంబాబు, దేవీప్రసాద్, హనుమంతు, కుమార్, భరణి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక లోక్‌సత్తా నేతల అభ్యర్థన మేరకు వినాయక ఆలయంలో పూజ చేసి పర్యటనకు జేపీ శ్రీకారం చుట్టారు.

ఎన్నుకుని నెత్తిన పెట్టుకుంటున్న పాలకులే రైతుల పాలిట శత్రువుల్లా వ్యవహరిస్తున్నారని జేపీ అన్నారు. రెండు ఉదాహరణలను ఈ సందర్భంగా రైతుల ముందుంచారు. 2010లో మనదేశంలో ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా గోదాముల్లో మూలుగుతూ, పైన ఆచ్ఛాదనలు కూడా లేకుండా పందికొక్కుల పాలవుతుంటే, మరోపక్క విదేశాల్లో రేటు పలుకుతున్నా మన ధాన్యం రైతులు కనీస ధర రాకుండా ఇబ్బందిపడుతుంటే, .. పాలకులు ఏమాత్రం పట్టింపు కూడా లేకుండా ఎగుమతులపై నిషేధాన్ని కొనసాగించారన్నారు. దేశ జనాభాలో అత్యధికులు వ్యవసాయం మీద ఆధారపడి వున్నారన్న జ్ఞానం కూడా లేకుండా వ్యవహరించారన్నారు. దీనిపై లోక్‌సత్తా పార్టీలకతీతంగా, రైతులను ఏకం చేస్తూ పోరాడిందన్నారు. 2011లో తాను ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్‌ను కలిసి దక్షిణాదిలో రైతుల పరిస్థితిని వివరించి ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేయమని కోరానన్నారు. తనకు కూడా సమాచారంలేని వివరాల్ని కూడా ఈ సందర్భంగా ప్రధాని వివరించారని, సింధ్ ప్రాంతంలో వరదలు వచ్చి అక్కడా రేటు పెరిగిందని, సైబీరియాలోనూ డిమాండ్ ఉందని చెప్పారన్నారు. ఇన్ని తెలిసి ఎందుకు రైతులను అణగదొక్కుతున్నారు ప్రధానీ? అంటే ఎట్టకేలకు ఎగుమతులపై ఆంక్షల్ని ఎత్తివేశారన్నారు. ఆరోజున ఇండియా 1కోటి టన్నుల ఆహారధాన్యాల్ని ఎగుమతి చేసి రికార్డు సృష్టించిందని, ఇప్పటికీ ఆ ఎగుమతులు కొనసాగుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతులకు మేలు చేస్తున్నాయని హర్షధ్వానాల మధ్య తెలిపారు. అలాగే 2012లో పక్క రాష్ట్రంలో బీపీటీ వెరైటీ ధాన్యానికి రేటు ఉన్నా కూడా అక్కడ అమ్ముకోవడానికి వీల్లేదని, అమ్మితే అరెస్టు చేస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అణచివేస్తుంటే, కర్నూలు నుంచి, నిజామాబాద్ నుంచి రైతు సత్యాగ్రహ యాత్రను చేసి మహారాష్ట్ర, కర్ణాటకలో ధాన్యాన్ని అమ్మామని, దమ్ముంటే అరెస్టు చేయమని ఛాలెంజ్ చేశామని, దీంతో ఆంక్షల్ని తొలగించారని జేపీ వివరించారు. దీనివల్ల 75కిలోల ధాన్యం బస్తా ధర రూ.750 నుంచి 1200లకు పెరిగి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లోని రైతులకు ఒక్క బీపీటీ వెరైటీలోనే, ఒక్క సీజన్‌లోనే రూ.3,600కోట్ల లాభం చేకూరించదన్నారు. ఆరోజున ఉద్యమాల పేరుతో పాలన, రాజకీయం పూర్తిగా స్తంభించిపోయి ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో కూడా లోక్‌సత్తా రైతుల కోసం, ప్రజల కోసం కృషి చేసి ఫలితాలు సాధించిందని అన్నారు. ఇందులో పాలకులు పైసా ఇవ్వలేదని, కేవలం విధానాలను మార్చడం ద్వారానే రైతులకు మేలుచేయగలిగామని అన్నారు. పాలకులకు చెడ్డ మనస్తత్వం లేకుండా ఉంటే చాలు.. వెంటనే అమలు చేయగలిగే పరిష్కారాలను లోక్‌సత్తా అందిస్తోందని, వీటిపై చర్చించి సాధించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. ★

# ఐదురోజుల ఖర్చు డబ్బును అదనంగా ఇస్తే చాలు.. అందరికీ ఆరోగ్యం: జేపీ



రాష్ట్రంలో, దేశంలో ఉన్న అతి పెద్ద సంక్షోభం ఆరోగ్య సంక్షోభమని, కేవలం రూ.55,000కోట్లు అదనంగా కేటాయిస్తే ప్రజలందరూ కులమతప్రాంతాలకతీతంగా ఆరోగ్యంగా ఉంటారని జేపీ అన్నారు. రోజుకు రూ.11,000 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలకు ఇది పెద్ద సమస్య కాదన్నారు. ఓ నాలుగైదు రోజుల ఖర్చును కోట్లాది ప్రజల ప్రాణాల్ని, శక్తిసామర్థ్యాలను కాపాడటానికి వినియోగించటాన్ని మించి పాలనకు అర్థమేముంటుందన్నారు. ప్రజల కోసం పనిచేయాలన్న మంచి మనసుంటే ప్రభుత్వాలకు తేలిగ్గా ఈ సంకల్పం కలుగుతుందన్నారు. ఇలా పరిమిత నిధులతోనే ఈ దేశంలో అందరికీ ఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యాన్ని ఎలా అందించవచ్చో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నమూనా అందచేశామన్నారు. ఆరోగ్యం గురించి మన మీడియాలో పెద్ద చర్చ ఉండదు కాబట్టి పాలకులు కూడా పట్టించుకోవటం లేదన్నారు. చూద్దాంలే అన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో పొద్దున లేచిన దగ్గర్నుంచీ ఆరోగ్యం, విద్యలను ఎలా అందించాలని అని చర్చోపచర్చలు జరుగుతుంటే.. మనదగ్గర మాత్రం ఎవరు వచ్చే ఎన్నికల్లో గెలుస్తారు, ఎవరి కొడుకు రాజవుతాడు వంటి పనికిమాలిన చర్చలు జరుగుతున్నాయన్నారు. అందుకే.. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి, బాలికలు, మహిళల భద్రత, లంచాలు లేని సేవలు, వ్యవసాయంలో ఆదాయం అనే ఆరు అంశాలలో పరిష్కారాలను సాధించేందుకు సురాజ్య యాత్రను ప్రారంభించామన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా జేపీ విజయనగరం జిల్లా పార్వతీపురం ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడి వైద్యసేవల తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.

విజయనగరం సహా కొన్ని జిల్లాల్లో ప్రభుత్వాసుపత్రులను ఇప్పటికే సందర్శించానని, గతంలో కంటే వైద్యసేవలు మెరుగుపడినా ప్రజల అవసరాలకు ఏమాత్రం సరిపోవని జేపీ అన్నారు. దేశంలో ఏటా నివారించదగ్గ వ్యాధులతో 12లక్షలమంది పిల్లలు మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ మధ్య ఓ 30-40లక్షల మరణాలను తగ్గించి చాలా గొప్ప విజయంలా చెబుతున్నారన్నారు. కడుపులో ఉండగానే సోకే వ్యాధుల వల్ల 3లక్షల మంది అంగవైకల్యంతో

### ఏ ఊరు మీది.. ఏ సమస్యతో వచ్చారు

మీది ఏ ఊరు, ఇక్కడికి ఎంత దూరం, ఏ ఆరోగ్య సమస్యతో వచ్చారు.. మీకు దగ్గరలో ఆసుపత్రులు లేవా? అని రోగులతో జేపీ ముచ్చటించారు. ఆస్పత్రి పరిస్థితి, వైద్యులు, సిబ్బంది, ఓపీ, ఇన్‌పేషెంట్లు, శస్త్రచికిత్సలు, మందులు తదితర అంశాలను ఆరా తీశారు. వార్డుల్లోకి వెళ్లి రోగులతో స్వయంగా మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బెడ్‌ల దగ్గర కేస్ షీట్లను పరిశీలించి ఎటువంటి చికిత్సలు అందిస్తున్నారో వైద్యులను వాకబు చేశారు. ఆస్పత్రిలో వైద్యసేవలను, సమస్యలను సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు వివరించారు. గిరిజన ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న ఈ ప్రాంతీయ ఆస్పత్రి కీలకమని, ఇటువంటి చోట మరిన్ని ఆధునిక సదుపాయాలతోపాటు అవసరమైన వైద్యసేవల సిబ్బందిని నియమిస్తే పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని జేపీ అన్నారు. ఆస్పత్రుల విషయంలో అవసరమైన సూచనలు, సలహాల్ని ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

పుడుతున్నారన్నారు. దీన్ని రూపుమాపేందుకు టీకాలున్నా అందుబాటులోకి తేవటంలో అలసత్వం చూపుతున్నారన్నారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు తాను చేసిన ప్రయత్నం వల్ల ఇటీవల ర్యుబెల్లా వ్యాక్సిన్ వచ్చిందన్నారు.

వైద్యం సరిగా లేకపోవడం వల్లే మన వద్ద అపారమైన మానవ వనరులు వృధా అవుతున్నాయని, పేదరికం ఎడతెగకుండా కొనసాగుతోందని అన్నారు. కొద్దిపాటి అదనపు నిధుల్ని ఇస్తే ఆరోగ్యాన్ని బాగు చేసే అవకాశాల గురించి చర్చించకుండా మన ప్రభుత్వాలు సమస్యల నుంచి తాత్కాలికంగా ఉపశమనం కలిగించే మత్తుమందుల్లాంటి తాయిలాల పథకాలతో కాలక్షేపం చేస్తున్నాయన్నారు. ప్రజల ప్రయోజనాలకన్నా ఎన్నికల్లో గెలుపే రాజకీయాలకు లక్ష్యంగా మారిందన్నారు.

అమెరికా వంటి దేశాల్లో లక్షమందికి మూడువేలమంది సిబ్బంది ఉంటే, మన వద్ద 240 మంది మాత్రమే ఉన్నారని, ఇలాంటి వసతుల మధ్య వైద్యసేవలు ఎలా మెరుగుపడతాయని జేపీ ప్రశ్నించారు. ఏ ఆసుపత్రిలో చూసినా మంచాల కంటే రోగుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఒక ప్రాంతీయ ఆసుపత్రికి ఏడాదికి 25,000మంది రోగులు వస్తుంటే సేవలు ఏదోక మేర బాగున్నట్టేనని, కానీ గత్యంతరం లేకే వారు వస్తున్నారని కూడా మర్చిపోకూడదని అన్నారు. జిల్లా మొత్తం ఒకే ఆసుపత్రికి రావటం వల్ల.. ఉన్న పరిమిత వైద్య సదుపాయాల్లో కూడా నాణ్యత తగ్గుతుందన్నారు.

వైద్యసిబ్బంది, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, కొత్తకోట పాపారావు, ఎన్ఏ బాషా, నాయుడు, సింహాచలం, ప్రభాకరరావు, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ★

## ప్రపంచ యువజన, విద్యార్థి సదస్సుకు మెట్ల జగన్



రష్యాలోని సోచిలో జరిగిన 19వ ప్రపంచ యువజన, విద్యార్థి సదస్సుకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ ఉపాధ్యక్షుడు మెట్ల జగన్ హాజరయ్యారు. అక్టోబర్ 14 నుంచి 22 వరకు ఈ సదస్సు జరిగింది. నిర్వాహక కమిటీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి అలెగ్జాండర్ భూగవ్ ఆహ్వానం మేరకు జగన్ ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల నుంచి 20వేల మంది యువ, విద్యార్థి నేతలు సదస్సుకు వచ్చారు. మనదేశంలో వివిధ రాష్ట్రాల నుంచి 200మంది హాజరయ్యారు. ★

## తెరిచిన బోరుబావులను కూడా సర్వేలో పరిష్కరించాలి

తెరిచిన బోరు బావుల వివరాలను కూడా సమగ్ర భూ సర్వేలో నమోదు చేసి చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్ అన్నారు. సర్వేలో భాగంగా పసిపిల్లల సంరక్షణ, ప్రాణ రక్షణ కోసం కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.సురేంద్రమోహన్‌ను కోరినట్టు చెప్పారు. అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసే సమయంలో.. ఆ రైతు లేదా ఆ కుటుంబంలో ఉన్నవారు తమ భూమిలో ఎన్ని బోర్లు వేశారు, ఎన్ని బోర్లలో నీటి లభ్యత లేదు, నీరు లేని బోర్లను సక్రమంగా పూడ్చారా తదితర వివరాలను కూడా నమోదు చేయాలని రమేష్ అన్నారు. తెరిచి ఉంచిన బోర్లను పూడ్చి వేయాలన్నారు. ప్రభుత్వం ప్రతి రూపాయినీ, ప్రతి కార్యక్రమాన్ని సమగ్రంగా వినియోగిస్తే భవిష్యత్ తెలంగాణ సురక్షితంగా, అద్భుతంగా




ఉంటుందన్నారు. తమ ప్రతిపాదనల పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగరాజు, కిరణ్, పుష్ప, వెంకటేశ్వర్లు తదితరులు కలెక్టర్‌ని కలిసినవారిలో ఉన్నారు. ★

# ఉద్దానం కిడ్నీవ్యాధి మూలాల పరిశోధనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: జేపీ

- ఏడు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొమ్మని లోక్‌సత్తా ఎప్పుడో చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది
- వైద్యపరిశోధన మండలి ఆధ్వర్యంలో వేగంగా అధ్యయనాలు జరగాలి
- రోజుకో రకం ప్రకటనలతో ప్రజలను భయభ్రాంతులను చేయవద్దు
- సోంపేట ఆసుపత్రిని ఏరియా హాస్పిటల్‌గా మార్చాలి

ఉద్దానం కిడ్నీ వ్యాధుల విషయంలో ప్రాథమికస్థాయిలో వ్యాధిని గుర్తించడంతోపాటు మూలాల పరిశోధనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డా॥ జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా సోంపేట సామాజిక ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్‌ను ఆయన పరిశీలించి రోగులతో మాట్లాడారు.

ఉద్దానం ప్రాంతంలోని ఏడు మండలాలకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొమ్మని లోక్‌సత్తా ఎప్పుడో చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, జిల్లాలో కిడ్నీ వ్యాధులపై ఎట్టకేలకు స్పందించి ప్రాథమిక చర్యలు తీసుకోవటం హర్షణీయమని జేపీ అన్నారు. ఉద్దానంలోని ఏడు మండలాలకు చెందిన అయిదు లక్షలమందిని ఇబ్బంది పెడుతున్న మూత్రపిండాల వ్యాధుల విషయంలో యుద్ధప్రాతిపదికన చర్యలు అవసరమన్నారు. జాతీయ వైద్యపరిశోధన మండలి బాధ్యత తీసుకుని జాతీయ, అంతర్జాతీయ వైద్యనిపుణులతో కిడ్నీ వ్యాధి మూలాల శోధనకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్రలో నిపుణులైన వైద్యులతో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి పరిశోధనలు, చికిత్స.. ఏపీ, తెలంగాణలోని కొన్ని ఇతర ప్రాంతాల్లో ఉద్దానం తరహాలో ప్రత్యేకంగా ఉన్న మూత్రపిండాల సమస్యను పరిష్కరించటానికి కూడా దోహదం చేస్తాయన్నారు. అంతేగాని, రోజుకొకరు వచ్చి నలుగురు బాధితులతో మాట్లాడి భయభ్రాంతులకు గురయ్యేలా ప్రకటనలు చేయటం తగదన్నారు. ప్రతి అయిదు వేల మందికి ఒక వైద్యుడిని అనుసంధానం చేసి తక్షణ వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కిడ్నీ వ్యాధి పరీక్షలకు అవకాశం కల్పించాలన్నారు. ఉద్దానంలోని 70 గ్రామాల పరిధిలో 25 నుంచి 40శాతం వరకు కిడ్నీ రోగులున్నారని, పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.



సోంపేట సామాజిక ఆసుపత్రి పరిసరాలను జేపీ పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇ.లక్ష్మీనారాయణ, వైద్యులు పి.శివాజీ, ఎస్.రాజేంద్రప్రసాద్, దుర్యోధన, పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి తదితరులతో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్యంపై సమీక్షించారు. ఆసుపత్రిలో మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సోంపేట సామాజిక ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా మార్చాలన్నారు. దీనివల్ల కిడ్నీ రోగులకు అవసరమయ్యే బ్లడ్‌బ్యాంకును ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆసుపత్రికి నూతన భవనాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచాలన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటం, పింఛన్లు అందించటం సరిపోదని, మిగిలిన చర్యలను కూడా వేగంగా చేపట్టాలని జేపీ అన్నారు.

కార్యక్రమంలో బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి, బి.గౌరీశంకర్, ఎం.సత్యనారాయణ, వి.నాగేశ్వరరావు, ఎస్.జానకిరాం, సోంపేట సర్పంచి చిత్రాడ నాగరత్నంశేఖర్, ఆసుపత్రి కమిటీ సభ్యులు దూసి మధుసూదనరావు, బరాటం వైకుంఠరావు, మత్స్యకార ఐక్యవేదిక మాజీ అధ్యక్షుడు మద్దు రాజారావు, వై.కృష్ణమూర్తి, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ★

# ఆ డబ్బు మోదీది కాదు, చంద్రబాబుది కాదు, కేసీఆర్‌ది కాదు, జగనన్నది కాదు



స్కీము ఏదైనా, హామీ ఏదైనా.. పసిబిడ్డల దగ్గర్నుంచి ప్రతి పౌరుని పేరు మీదా ప్రభుత్వం ఏటా ఖర్చు చేస్తున్న డబ్బు నరేంద్ర మోదీదో, చంద్రబాబుదో, కేసీఆర్‌దో, జగనన్నదో కాదని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ నిత్యం గుర్తుంచుకోవాలని జేపీ అన్నారు. ఈ డబ్బంతా పూర్తిగా ప్రజలు పన్నుల రూపంలో కట్టినదో, వనరులమ్మినదో, లేక ప్రజల పేరుతో అప్పు తెచ్చినదో మాత్రమేనని స్పష్టంచేశారు. మన పేరు మీద విదేశాల నుంచి అప్పు తెచ్చినా, ఆ అప్పును ఏదోకరూపంలో, మనమో, మన పిల్లలో, వారి పిల్లలో కట్టాల్సిందేనని అన్నారు. అందుకే ప్రభుత్వాలు ఖర్చు చేసే ప్రతి రూపాయి మీదా నిఘా వేసి ఉంచాలని, సరైన రీతిలో ఖర్చు పెడుతున్నారో లేదో ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ఉండాలని అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో ఆయన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల గ్రామీణంలో పర్యటించారు. ప్రజానీకం సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారాలపై ఆలోచింపచేశారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌ల ద్వారా సురాజ్య కార్యక్రమాల్లో ఎలా భాగస్వాములవ్వొచ్చో, చిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద సమస్యలను ఎలా పరిష్కరించుకోవచ్చో వివరించారు.

పాఠశాలల్లో విద్యార్థుల మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ఖర్చు ఫీజు రీఇంబర్స్‌మెంట్ కంటే కూడా చాలా ఎక్కువని జేపీ తెలిపారు. కానీ మనం ఫీజు రీఇంబర్స్‌మెంట్ చుట్టూ హడావుడి చేస్తూ, విద్యార్థికి పునాది వేసే పాఠశాల చదువును నిర్లక్ష్యం చేస్తున్నామన్నారు. స్కూలులో సరైన చదువు లేకపోతే దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందన్నారు.

అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల తన సొంతూరు వాద్‌నగర్‌కి వెళ్లి ఎంతో భావోద్వేగంతో మాట్లాడారని, అంతకుముందున్న యూపీయే ప్రభుత్వం ఆరోగ్యాన్ని పట్టించుకోలేదని విమర్శించారని జేపీ అన్నారు. అయితే ఇప్పుడు మోదీ ప్రభుత్వంలోనూ అలాగే ఉందని, పరిస్థితి ఏమీ మారలేదని అన్నారు. అయినా కూడా ఏమాత్రం సంకోచం, లజ్జ లేకుండానే ప్రధాని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారన్నారు. ఆరోగ్యరంగానికి 3శాతం వరకూ జాతీయ ఆదాయం కేటాయిస్తామని యూపీయే ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందని, ఇప్పుడు మోదీ ప్రభుత్వం కూడా 1.1శాతం నిధులనే ఇస్తోందని, అది కూడా పద్ధతీపాడూ లేకుండా ఖర్చు చేస్తోందని అన్నారు. నేతల మాటల వెనక వాస్తవాల్ని కాస్త లోతుగా చూసే అలవాటు ప్రజలకుంటేనే పాలకులు భయపడతారన్నారు. అందరికీ ఆరోగ్యం కోసం తాను రూపొందించిన కార్యక్రమాన్ని యూపీయే ప్రభుత్వం కుదించి జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా అమలు చేసిందని, పిల్లల్లో గుండెజబ్బులు రాకుండా గర్భస్థ దశలోనే నిరోధించే రుబెల్లా టీకా కోసం తాను 21 ఏళ్లుగా పోరాడుతుంటే ఇటీవల సాకారమైందని అన్నారు. ఇప్పుడు కేటాయిస్తున్న నిధులకు అదనంగా కొద్దిపాటి బడ్జెట్‌ను కేటాయిస్తే, జేబులో నుంచి ఖర్చు లేకుండానే అందరికీ ఆరోగ్యాన్ని అందించే నమూనా పథకాన్ని మోదీ ప్రభుత్వానికి కూడా అందించినా ఇంతవరకూ చలనం లేదన్నారు. ఆరోగ్య ఖర్చుల కోసం ఏటా 6 కోట్ల మంది ప్రజలు పేదలవుతున్నా పాలకులు మాత్రం ఊకదంపుడు ఉపన్యాసాలు, పార్టీ రాజకీయాల ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారన్నారు.

ఇంట్లో ఉన్న డబ్బును, పరిమిత వనరుల్ని మనం జాగ్రత్తగా ఉపయోగిస్తేనే ఆ కుటుంబం ఎదగగలుగుతుందని, అలాగే మన పేరు మీద ప్రభుత్వాలు ఖర్చు చేసే ప్రతి రూపాయీ సద్వినియోగమయ్యేలా చూసుకుంటేనే మనకు సరైన ఉపాధి, భద్రత, నూతన అభివృద్ధి అవకాశాలు, శాంతియుత సమాజం సమకూరతాయని జేపీ అన్నారు. ప్రభుత్వాలు ఇప్పుడు చేస్తున్న ఖర్చునే సరైన దిశలో ఉపయోగించి ప్రజలకు పెద్దఎత్తున లాభం చేకూర్చే ఎజెండాతో సురాజ్య యాత్రను చేపట్టామని, కాస్త సమయం వెచ్చించి వీటి గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. ★

# జనం చేతికి అధికారం + జవాబుదారీతనం = అద్భుత విజయం (ఉలిచి - దేశానికే దిక్సూచి)

జనం చేతికి జవాబుదారీతనంతో అధికారం ఇవ్వడం ద్వారానే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు నిజమైన ప్రజాస్వామ్య పాలనను అందించగలుగుతాయి, రాజ్యవ్యవస్థకు – ప్రజలకు మధ్య ఒప్పంద లక్ష్యం నెరవేరుతూ ప్రజలు తమ జీవితాల్లో తామే హీరోలుగా తలెత్తుకుని బతకగలుగుతారు.. ఇది ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన సత్యం!

ఎక్కడ, ఎవరికి, ఏ సేవల అవసరం ఉందో, ఎవరు ఆ సేవలఅక్కడ, వారికే, ఆ సేవలకు సంబంధించి జవాబుదారీతనంతో అధికారాన్నిచ్చి వికేంద్రీకరణ చేస్తే.. ప్రజల రోజువారీ జీవితాలు భద్రతతో ఆనందంగా సాగుతాయి.

ఇదే వికేంద్రీకరణ సూత్రాన్ని సంస్థలకూ అన్వయిస్తే, జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలు అద్భుత విజయాలను సాధిస్తాయి.

ఇలా ప్రజల భాగస్వామ్యం, అధికార వికేంద్రీకరణతో అద్భుతాలకు రాజ్యాంగంలో తగిన వ్యవస్థీకృత ఏర్పాటు లేకపోవటం వల్ల మనదేశంలో కేంద్రీకృత పాలన ఉన్నకొద్దీ పెరిగిపోతూ జనం జీవితాల్ని దుర్భరంగా మారుస్తోంది. పలు సంస్థలను తెల్లఏనుగులుగా తయారుచేస్తోంది. లక్షల జీతాలు తీసుకుంటూ పనిచేయకుండా, ఫలితాలు సాధించకుండా నేతలతో కుమ్మక్కయి సోమరిపోతులుగా, అవినీతిపరులుగా ప్రభుత్వోద్యోగులు, అధికారులు తయారయ్యేలా చేస్తోంది.

దేశ విభజన నేపథ్యంలో ఒక సువిశాల దేశంగా భారత్ మనుగడ పట్ల ఉన్న భయాందోళనతో జాతీయోద్యమ నేతలు, రాజ్యాంగ నిర్మాతలు కేంద్రీకృత విధానం వైపు మొగ్గు చూపారు. కానీ స్వతంత్రం వచ్చిన కాలం నాటి తరం కనుమరుగమవటంతో ఈ కేంద్రీకృత పాలన దేశంలో అవినీతికి, వంశపారంపర్య రాజకీయాలకు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలిచ్చి ద్వితీయ శ్రేణి పౌరుల్లా బతకటం, ఎమ్మెల్యేలు శాసనాలు చేసేవారిగా కాకుండా నియోజకవర్గ సామంతరాజుల్లా మారి దోచుకోవటానికి దారితీసింది. **1970**లలో ఎమర్జెన్సీ కాలంలో మొదలైన భారీ రాజకీయ కేంద్రీకృత పాలన అదే బాటలో కొనసాగి స్థానిక ప్రభుత్వాలను బలహీనపరిచింది. కాలం గడుస్తున్నకొద్దీ, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం అవినీతి, కేంద్రీకృత పాలనా నమూనా నుంచి పెద్దఎత్తున తమ స్వార్థ ప్రయోజనాలను పొందటానికి అలవాటుపడ్డారు. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసేందుకు తర్వాతి దశలో చేసిన అన్ని ప్రయత్నాలూ శాసనసభ్యులు, అధికారుల మధ్య లాలూచీ వల్ల నీరుగారాయి. దేశ ఆదాయం పెరుగుతున్నా, ఏ పార్టీని ఎన్నుకున్నా పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. ఓటు ద్వారా సాధించుకోవాల్సిన తమ అసలైన ప్రయోజనాలను వదిలేసి.. ప్రభుత్వం నుంచి ఒక హక్కుగా జరగాల్సిన రోజువారీ పనుల కోసం ఓటును తాకట్టుపెట్టుకునే దుస్థితి ఎక్కువశాతం ప్రజలకు ఏర్పడింది. ఇదో విషవలయంగా మారి కోట్లు ఖర్చు పెడితే తప్ప ఎన్నికల్లో గెలవలేని పరిస్థితి ఏర్పడటంతో.. నిజాయతీ, సమర్థత గల వారు రాజకీయాల నుంచే దూరమవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పాలకులు తీసుకొచ్చిన ఆర్థిక రంగంలో లైసెన్స్‌రాజ్ విధానాన్ని తొలగిస్తూ తెచ్చిన సంస్కరణలు కూడా కొందరికే భారీ లబ్ధి చేకూరుస్తూ ప్రజల మధ్య ఆర్థిక అగాధాన్ని ఇంకా పెంచుతున్నాయి. కొందరు వ్యక్తిగతంగా నిజాయతీపరులైన నాయకులు ఎలాగోలా పదవిలోకి రాగలిగినా.. ఆటనియమాలను మార్చలేక ఉన్న వ్యవస్థలో పరిమిత మార్పులు తేవటానికే పరిమితమవుతున్నారు. ప్రభుత్వాల ఆదాయం పెరగటంతో తాయిలాల స్థాయి పెరిగింది తప్ప, ప్రజలను ఆలోచించనీయని రాజకీయంలో మాత్రం ఎటువంటి మార్పూ లేదు. ఇలా పాలన గురించి ప్రజలకు తెలియపోవడం, పాలనలో వారి భాగస్వామ్యాన్ని పెరగకపోవడం, పౌరసత్వం, నాయకత్వం ఎదగకపోవడం వల్ల చివరికి దేశ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతినటానికి  స్థానిక స్వయంపాలనను/ప్రతిపత్తిని అణగదొక్కటం  ప్రధాన కారణంగా మారింది. చిట్టచివరికి మనిషికి తాయిలాలిస్తాం తప్ప, సాధికారత మాత్రం ఇవ్వం అంటున్న పాలకుల వల్ల.. ఎన్ని సానుకూల వనరులున్నా ఎదిగే అవకాశాలను భారత్ కొన్ని తరాలుగా కోల్పోతూ వస్తోంది. ఇప్పుడు యువత, సాంకేతికత వంటి సానుకూల పరిస్థితులు కూడా నిరుపయోగంగా మారే ప్రమాదం ఏర్పడింది.

రోజువారీ చాలా అంశాలను స్థానికంగానే సమర్థవంతంగా నిర్వహించుకున్న **5,000** ఏళ్లపైబడిన భారతదేశ సుదీర్ఘ చరిత్రను చూస్తే స్థానిక ప్రభుత్వాలను రాజ్యాంగ నిర్మాతల దగ్గర్నుంచి నిర్లక్ష్యం చేయటం ఒక అసాధారణ వైఫల్యంలా కనిపిస్తుంది. గత కొన్నేళ్లుగా స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల గురించి కొంత ఏకాభిప్రాయం వ్యక్తమవుతోందిగానీ

*అది మాటలకే పరిమితమవుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజల మీద పెత్తనం చేయటానికి అలవాటు పడ్డ పాలకులు, అధికారులు అభివృద్ధి, పాలనా వికేంద్రీకరణకు అడ్డుపుల్లలు వేస్తున్నారు. అందుకే **1990**ల తొలినాళ్లలో వచ్చిన **73,74** రాజ్యాంగ సవరణలు నామమాత్రంగా మిగిలాయి. లోక్‌సత్తా కృషి వల్ల **14**వ ఆర్థిక సంఘం స్థానిక ప్రభుత్వాలకు నిధులను గణనీయంగా పెంచి రూ.**2,87,436**కోట్లు చేసిందిగానీ, అది ఒక మూలకే సరిపోతుంది. ఇది కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిధుల బదిలీలో **7.3**శాతం మాత్రమే. ఈ దేశంలో ప్రభుత్వం చేసే మొత్తం వ్యయంలో చాలా చిన్న మొత్తం ఇది. ప్రపంచంలో ఎక్కడైనా మొత్తం ప్రభుత్వ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలకు **20-30**శాతం వాటా ఉంటుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదిలీ అవుతున్న నిధుల్లో **33**శాతాన్ని, అంటే ప్రస్తుత ఆర్థిక సంఘం దాదాపు రూ.**8** లక్షల కోట్లను స్థానిక సర్కార్లకు బదిలీ చేయాలి.*

*స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగంలో హోదా కల్పించకపోయినా, కొంతమంది అసాధారణ అధికారుల, పౌరుల కృషి వల్ల అక్కడక్కడా ఇంకా మనదేశంలో అవి అద్భుతాలను సాధిస్తూనే ఉన్నాయి. దీపస్తంభాల్లా మార్గాన్ని చూపుతూనే ఉన్నాయి. అమూల్, అలందూర్, ఇస్రో, తార్నాక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇందుకు వివిధ రంగాల నుంచి కొన్ని ఉదాహరణలు. ఇదే తరహాలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు సాగునీటి రంగంలో సాధించిన అద్భుత విజయానికి నాంది పలికిన ఉలిచి గ్రామానికి వెళ్లే ముందు వీటి గురించి ఒక్కసారి చూద్దాం..*

**అమూల్:** సేవల అవసరం ఉన్నవారికే అధికారాన్నిచ్చి వికేంద్రీకరణ చేస్తే, సాంకేతికత, వృత్తినైపుణ్యాలను అవకాశంగా మలచుకుని ఆర్థికంగా సిరులు పండించగలమని, సమాఖ్య పద్ధతుల్లో దేశవ్యాప్త బ్రాండ్ ఇమేజ్‌ని సాధించగలమని పాల సహకార సంఘాలు శ్వేత విప్లవాన్ని తీసుకొచ్చి నిరూపించాయి. ప్రభుత్వ వేధింపులు, నియంత్రణల మధ్య కూడా ప్రభుత్వ సాయం లేకుండా చిన్న పాల సహకార సంస్థల ద్వారా వర్గీస్ కురియన్ శ్రీకారం చుట్టిన కృషి వల్ల లక్షలాది రైతుల జీవితాల్లో గణనీయ మార్పు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో.. ప్రభుత్వ అణచివేతల నుంచి స్వావలంబన గల సహకార సంస్థలను విముక్తి చేసేందుకు నిజమైన ఉదార పరస్పర సహాయ సహకార సంస్థల (మ్యాక్స్) చట్టాన్ని 1995లో అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్న డా॥ జేపీ సూచన మేరకు ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ అమలులోకి తెచ్చారు. ఐఏఎస్ ట్రైనీగా తాను కరీంనగర్ జిల్లాలో ఉన్నప్పుడు ముల్కనూర్ సహకార సంఘానికి ఛైర్మన్‌గా ఉన్న విశ్వనాథరెడ్డితో పరిచయం, కురియన్ క్షీరవిప్లవ కృషితో ఉన్న అనుబంధంతో.. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటంలో సహకార రంగం ప్రాధాన్యతను జేపీ స్పష్టంగా గుర్తించారు. అందుకే మ్యాక్స్ వంటి చట్టాన్ని ప్రతిపాదించారు. ఆ తర్వాతి దశాబ్దంలో అలాంటి చట్టాన్ని మరో 8 రాష్ట్రాల్లో అమలు చేశారు. ప్రభుత్వ నియంత్రణలోని సహకార సంస్థలు చాలా మేర విఫలమై నిరంతరం మాఫీలు, సబ్సిడీలను అడుగుతుండగా, మ్యాక్స్ చట్టం కింద స్వావలంబన, స్వయంప్రతిపత్తి కలిగిన ఈ సహకార సంస్థలు పెద్దఎత్తున విజయవంతమయ్యాయి. అయినా కూడా స్వావలంబన గల సహకార సంస్థలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు తరచూ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. జాతీయ సలహా మండలిలో సభ్యుడిగా ఉన్న లోక్‌సత్తా జేపీ ఆర్టికల్ 19 (1)



(సి) కింద సహకార సంస్థల రక్షణకు గ్యారంటీనిచ్చేలా 97వ రాజ్యాంగ సవరణను తేవటానికి పార్లమెంటులో అధికార, ప్రతిపక్ష పార్టీలను ఒప్పించారు. స్వతంత్ర భారతదేశాన్ని గణనీయంగా ప్రభావితం చేసే ఈ రాజ్యాంగ సవరణ 2012లో సాకారమైంది. ఇది తన ముగ్గురు హీరోలలో ఒకరైన కురియన్‌కు కానుక అని జేపీ తరచూ చెబుతుంటారు.

**అలందూర్:** తమిళనాడులోని అలందూర్ మునిసిపాలిటీ 80,000 జనాభా ఉన్న ఓ చిన్న పట్టణం (ప్రస్తుతం చెన్నై కార్పొరేషన్‌లో భాగంగా ఉంది). మనదేశంలో స్థానిక వనరులతో, పౌరుల మద్దతుతో చక్కటి పారిశుద్ధ్య వ్యవస్థను నిర్మించుకున్న మొట్టమొదటి చిన్న పట్టణం ఘనతను అలందూర్ సాధించింది. అక్కడి స్థానిక ప్రభుత్వం ప్రజలకు వారు కట్టిన ప్రతి రూపాయికీ లెక్కచెబుతూ పారదర్శకంగా ప్రాజెక్టును పూర్తిచేసింది. దీంతో, అక్కడి జనం కొద్దికాలంలోనే పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సుందరీకరణ వంటి లాభాలను ఆర్జించారు. వారి ఇళ్ళ స్థలాల ధరలూ భారీగా పెరిగిపోయాయి.

**తార్నాక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** ప్రజల రోజువారీ

## స్థానిక సాధికరతకు భారత్‌లో వేల ఏళ్ల చరిత్ర

5,000 ఏళ్ల క్రితమే సింధులోయ నాగరికత మన వ్యవస్థీకృత పట్టణ జీవనానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. విశాల రహదారులు, మార్కెట్ స్థలాలు, పాలనా కార్యాలయాలు, సామూహిక స్నానఘట్టాలు, మురుగుపారుదల, పారిశుద్ధ్య వ్యవస్థలు ఉండేవి. హరప్పా లిపిని ఇంకా విశ్లేషించలేకపోయినా, అందుబాటులో ఉన్న ఆధారాలు, విస్తృత భౌగోళిక విస్తీర్ణం బట్టి, హరప్పా నగరం స్థానిక నిర్ణయాధికారమున్న స్వయంపాలిత నగర రాజ్యమని తెలుస్తుంది. వేదకాలంలో కూడా స్థానిక పాలన ఒక కట్టుబాటుగా ఉండేది. గౌతమ బుద్ధుడు, మహావీరుడు కాలంనాటికి లిచ్ఛావి గణతంత్ర రాజ్యం స్థానిక ప్రభుత్వాల వ్యవస్థకు నిలువుటద్దంగా ఉండేది. సమానత్వం ప్రాతిపదికన స్థానిక తెగలను సంఘటితం చేసి సమాఖ్యలా ఏర్పాటు చేశారు. ఇతర సమాఖ్యల్ని- విదేహ రిపబ్లిక్, వజ్జయిని రిపబ్లిక్, ప్రాచీన రచనల్లోని (అంగుట్టార నికాయ, భగవతి సూత్ర) పదహారు మహాజనపదాల ప్రస్తావన చూస్తే, స్వయంపాలిత స్థానిక సంస్థలు సమానత్వం ప్రాతిపదికన కాన్ఫెడరేషన్లుగా ఏర్పడ్డాయని అర్థమవుతుంది. 2300 సంవత్సరాల క్రితం నాటి మౌర్య సామ్రాజ్యం నుంచి మొగల్ సామ్రాజ్యం (క్రీశ 1526-1707) వరకు, సుమారు రెండు సహస్రాబ్దుల కాలం, గ్రామాలకు తమ సొంత పాలనా వ్యవస్థ ఉండేది. పట్టణాలలో నియమిత అధికారులు, కౌన్సిల్, ఎన్నికలైన పాలనా అధికారులకు విధివిధానాలు వంటి భిన్నమైన ఏర్పాట్లతో ఈ వ్యవస్థ పనిచేసేది.

దక్షిణ భారతదేశంలో చోళుల కాలంలో స్థానిక పాలన అబ్బురపరిచే స్థాయికి ఎదిగింది. క్రీశ 920 నాటి ఉత్తరామెరూర్ శాసనం చూస్తే, ఎన్నో రకాలుగా సంస్కరించిన ఎన్నికల వ్యవస్థ, 1100 ఏళ్ల క్రితమే లిఖిత రాజ్యాంగం ద్వారా స్థానిక పాలన ఉండటం సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది. డా॥ ఆర్.నాగస్వామి ('ఉత్తరామెరూర్, తమిళనాడు చారిత్రక గ్రామం' రచయిత) అన్నట్టు.. వార్డుల ఏర్పాటు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు అర్హతలు, అనర్హతకు నిబంధనలు, ఎన్నికల విధానం, ఎన్నికైన కమిటీల ఏర్పాటు, ఆ కమిటీల బాధ్యతలు తదితరాల గురించి ఆ శాసనంలో విస్తుగొలిపే వివరాలున్నాయి.

బ్రిటీషు ఇండియా వలస పాలనలో కూడా స్థానిక పాలనకు గణనీయ ప్రాధాన్యత కల్పించారు. 1688లో ఏర్పాటు చేసిన మద్రాసు కార్పొరేషన్.. బ్రిటన్‌కమినహా మిగిలిన కామన్వెల్త్ దేశాల్లోనే మొట్టమొదటిది. కానీ స్థానిక పాలనలో కీలక మలుపు 1919 భారత ప్రభుత్వ చట్టం. ప్రజాదరణ గల మంత్రి నిర్వహించే విభాగానికి స్థానిక ప్రభుత్వ బాధ్యతను బదిలీ చేయటం, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు ఓటర్ల పరిధిని గణనీయంగా విస్తరించటం, పన్నులను నిర్ణయించే అధికారాన్ని మునిసిపల్ సంస్థలకు అప్పగించటం, ఎన్నికైన కౌన్సిళ్ల ఏర్పాటు, ఎన్నికైన ఛైర్మన్‌కి కార్యనిర్వాహక అధికారాలు తదితర మౌలిక మార్పులన్నీ అక్కడ్నుంచీ వచ్చాయి.

1924లో అనేకులు ప్రముఖ భారత స్వాతంత్ర్యయోధులు స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన మేయర్లు అయ్యారు. కలకత్తాలో చిత్తరంజన్ దాస్, అహ్మదాబాద్‌లో వల్లభాయ్ పటేల్, పాట్నాలో రాజేంద్ర ప్రసాద్, అలహాబాద్‌లో నెహ్రూ మేయర్లుగా ఎన్నికయ్యారు.

జీవితాల్లో 80శాతం సేవలు సక్రమంగా అందాలంటే నగరాల్లో, పట్టణాల్లో నిధుల్ని, అధికారాల్ని వార్డు స్థాయికి, వీలైతే కాలనీ స్థాయికి కూడా వికేంద్రీకరించాలని హైదరాబాద్ తార్నాక అనుభవం రుజువు చేస్తోంది. తార్నాక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌సీవోటీఆర్‌డబ్ల్యుఏ) చేసిన ప్రతి కార్యక్రమం అక్కడి ప్రజల్లో ఎక్కువమందిని భాగస్వాముల్ని చేస్తోంది. వారి శక్తిసామర్థ్యాలను వెలికితీస్తూ, అందరికీ లబ్ధి చేకూరుస్తోంది. సమస్యలను ఎవరో పైవారికి ఏకరువు పెట్టటం, పరిష్కారాలపై గందరగోళం, జాప్యాలు వంటివేమీ లేకుండా చాలా సందర్భాల్లో అక్కడివారు అవినీతికి ఆస్కారం లేకుండా, వేగంగా తమ పనుల్ని చేసుకోగలుగుతున్నారు. "ఓటుకు-తమ ప్రయోజనాలకు మధ్య సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా చేయటం, అధికారులలో జవాబుదారీతనం పెంచటం, తక్కువ రిస్కుతో కొత్త ఆలోచనల్ని అమలుచేయటం, ఇతర ప్రాంతాలకూ ఆదర్శంగా ఉండే పరిష్కారాలను అందించటం, నాయకత్వాన్ని పెంపొందించటం" - అధికార వికేంద్రీకరణ వల్ల కలిగే ఈ ఐదు ప్రయోజనాలూ తార్నాక అసోసియేషన్ కార్యక్షేత్రంలో మనకు కనిపిస్తాయి.

**ఇస్రో :** ఇస్రో, బార్క్, కొన్ని ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వాల కేంద్రీకృత ధోరణులు, నియంత్రణల వల్ల కాకుండా,

లోక్‌సత్తా సంస్కరణల్లో అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ముందు వరసలో ఉండటానికి, 2003లో దేశంలోనే రికార్డుస్థాయిలో 1కోటీ 8లక్షాల సంతకాల సేకరణను, పలు ఉద్యమాలను లోక్‌సత్తా చేపట్టటానికి.. ప్రకాశం జిల్లా అనుభవాలు కూడా పెద్ద స్ఫూర్తి అనుకోవటానికి ఏమాత్రం సందేహించాల్సిన పన్లేదు. లోక్‌సత్తా చొరవతో.. స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి హామీ ఇచ్చి మాట తప్పారు. రాష్ట్ర విభజన జరిగాక కూడా చంద్రబాబు చేయలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 'గ్రామజ్యోతి' అని మభ్యపెట్టి మాట తప్పారు. ఇప్పుడు చట్టబద్ధంగా గ్రామస్వరాజ్యం అంటున్నారు. చూద్దాం ఏం చేస్తారో!





స్వయంప్రతిపత్తి, సాధికారతల వల్ల విజయాలను సాధిస్తూ కాంతిరేఖల్లా భాసిల్లుతున్నాయి. ఇస్రో విజయాల గురించి ఇటీవలికాలంలో చాలామంది ప్రజలకు కొంత అవగాహన ఏర్పడింది. ఇస్రోకి సారథిగా ప్రభుత్వ ఉన్నతాధికారులు కాకుండా శాస్త్రవేత్తలే ఉంటారు. సంస్థ అంతర్గతంగా కూడా మొత్తం అధికారాలన్నీ ఒకేచోట కేంద్రీకృతం కాకుండా వివిధ శాఖలవారీగా వికేంద్రీకరించి ఉంటాయి. ప్రభుత్వం అధికంగా జోక్యం చేసుకోకుండా కావలసిన నిధులను జవాబుదారీతనంతో కేటాయిస్తూ ఉంటుంది. ఒక కిలోమీటర్‌ప్రయాణానికి ఆటో ద్వారా అయ్యే ఖర్చు కంటే తక్కువ ఖర్చుతో మన శాస్త్రవేత్తలు మార్స్‌కి 'మామ్' ఉపగ్రహాన్ని ప్రయోగించారని గర్వంగా ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ.. అలాంటి విజయాల్ని దేశ ప్రగతికి మూలమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఎందుకు సాధించలేకపోతున్నామో మాత్రం చెప్పలేకపోయారు. జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తి, నిధులు, సాంకేతిక పరిజ్ఞానం ఉంటే అన్ని రంగాలలో ఇస్రోలాగానే విజయాలను లభిస్తాయన్న చర్చ ప్రజల్లో కూడా జరగలేదు.

అమూల్, అలందూర్, తార్నాక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇస్రో.. ఈ పరంపరలో ప్రకాశం జిల్లాలో సాగునీటి రంగంలో జేపీ సాధించిన విజయాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

**జనం చేతికి అధికారం + జవాబుదారీతనం= ప్రకాశం జిల్లాలో జేపీ సాధించిన సాగునీటి అద్భుతం**

'జనం చేతికి అధికారం + జవాబుదారీతనం= అద్భుత విజయం' అనే ఫార్ములాతో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు స్వతంత్ర భారత చరిత్రలోనే సాటిలేని విజయాన్ని లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ సాధించి చూపారు. 1986-89లో ప్రకాశం జిల్లాలో ప్రజలను సమీకరించి, వారి భాగస్వామ్యంతో, వారి సొంత పనిగా, కొత్త చిన్న సాగునీటి పథకాల ద్వారా సుమారు 2,00,000 ఎకరాలకు (అన్ని రకాల పథకాలూ కలుపుకుని) ప్రభుత్వ పథకాల వ్యయంలో నామమాత్రపు ఖర్చుకే నీరందించారు. గుండ్లకమ్మ, పాలేరు, మూసీ, మానేరు నదులపై, ఓగేరు తదితర డ్రెయిన్లపై 453 మైనర్ ఎత్తిపోతల పథకాలు, 70 మళ్లింపు పథకాలు, 2800 బోరు బావులతో ప్రజల భాగస్వామ్యం ద్వారా ఈ రికార్డును జేపీ సాధించారు. ఈ మొత్తం స్కీముల్లో రైతులు ఒక్క రూపాయి కూడా ఎగ్గొట్టకుండా బ్యాంకు కిస్తీలను సక్రమంగా, రుణాలను నిర్ణీత సమయానికి ముందే చెల్లించారు. ప్రభుత్వ, ప్రయివేటు పరంగా పెట్టిన పెట్టుబడులను దాటి లాభాలు చాలా స్వల్ప వ్యవధిలోనే వచ్చేశాయి. దాదాపు 20 ఏళ్లలో, రాష్ట్రంలోని 22 జిల్లాలలో అమలైన ఎత్తిపోతల పథకాల కంటే కేవలం ఒక్క జిల్లాలో మూడేళ్ల లోపల ఎక్కువ పథకాలు తక్కువ ఖర్చుతో పూర్తయినాయి! హేతుబద్ధ లక్ష్యాన్ని ఎంచుకోవడం, దాని ద్వారా లబ్ధి పొందే ప్రజల్లోని శక్తిసామర్థ్యాలను లక్ష్యసాధన దిశగా వినియోగించటం, అందుకు ఇతరులెవరూ అడ్డుపడకుండా చూడటం మినహా ఈ పథకాలు వేటిలో తాను ఎటువంటి జోక్యం చేసుకోలేదని జేపీ చెబుతుంటారు.

## ఉలిచి - దేశానికే దిక్సూచి

వీటిలో మొట్టమొదటి ఎత్తిపోతల పథకం ఉలిచి గ్రామంలోనిది. జేపీ ప్రోత్సాహంతో ఆ గ్రామరైతులే నిర్మించుకున్న ఈ ప్రాజెక్టును ఇటీవల ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) అధ్యయన బృందం యూత్ సందర్శించారు. అంటే దాదాపు 30 ఏళ్ల తర్వాత! అక్కడున్న పెద్దలంతా ఎంతో సాదరంగా వారిని ఆహ్వానించి ఆతిథ్యమిచ్చారు. ఆ ప్రాజెక్టు ప్రారంభాన్ని, ప్రస్తుత నిర్వహణ తీరుని వివరించారు.

**ఆ వివరాలను ఎఫ్‌డీఆర్ అధ్యయన బృందంలోని ఎంబీ యే విద్యార్థి హర్ష ఇలా క్రోడీకరించారు..**

“1986 ప్రాంతంలో తన స్వగ్రామమైన ఉలిచిలో కరవు పరిస్థితులను చూసి చలించిన ప్రముఖ వైద్యుడు డా॥ చుంచు చలమయ్య గారు, తమ ప్రాంత సాగునీటి అవసరాలను తీర్చడానికి గుండ్లకమ్మ నదిపై ఎత్తిపోతల పథకం నిర్మించాల్సిందిగా అప్పటి ప్రకాశం జిల్లా యంత్రాంగానికి లేఖ రాశారు. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ డా॥ జయప్రకాష్ నారాయణ్ వెంటనే స్పందించారు. ఉమ్మడి అవసరాలను గుర్తించి ప్రజలే ముందుకొచ్చినప్పుడు, ప్రభుత్వం వారిని ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించాలని భావించారు. అదేరీతిలో జిల్లాలో 453 ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఎత్తిపోతల పథకాలన్నిటిలో రైతులను భాగస్వాములను చేస్తూ వారికే నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఇలాంటి పాలనాపోకడ తెలుగునాట అదే ప్రథమం.

ఉలిచిలో గుండ్లకమ్మ నది మీద ‘తెలుగు గ్రామీణ క్రాంతి పథం’కింద ‘తారకరామ ఎత్తిపోతల పథకం’ పేరిట గ్రామరైతులే ఎత్తిపోతలను నిర్మించుకున్నారు.

ఐదు లక్షల రూపాయల అంచనాతో రూపొందిన ఈ పథకానికి డా॥ చలమయ్య రూ. 2. 5లక్షలను రుణం రూపంలో అందించారు. నిర్మాణపనుల పర్యవేక్షణ బాధ్యత తీసుకున్నారు. కేవలం 40 రోజులలో తొలిదశ పనుల్ని ఇతరుల సాయం లేకుండా గ్రామరైతులు పూర్తిచేసుకున్నారు. మొదటి దశలో 300 ఎకరాలు, రెండో దశలో 347 ఎకరాలు, మూడో దశలో 360 ఎకరాల చొప్పున వెయ్యి ఎకరాలకుపైగా సాగునీటిని అందించే ఏర్పాట్లను చేసుకున్నారు.

ఈ ఎత్తిపోతల పథకం అమలులో వివిధ బాధ్యతలను ఉలిచి రైతులు వారి మధ్యే విభజించుకున్నారు. ఎవరి పాత్రను వారు సక్రమంగా నిర్వహిస్తూ, భేదాభిప్రాయాలు వస్తే పరిష్కరించడానికి ముగ్గురు పెద్దమనుషులను సైతం



నియమించుకున్నారు. గ్రామరైతుల సమష్టి కృషి ఫలితంగా జిల్లాలోనే ఉలిచి ఆదర్శగ్రామంగా గుర్తింపు పొందింది. తెలుగు నాట ఇతర జిల్లాలకే కాకుండా యావత్ దేశానికే దిక్సూచిగా నిలిచింది. గ్రామ ప్రయోజనాలను గుర్తించి కొంతమంది రైతులు వారి భూములను సైతం ఎత్తిపోతల పథకం కోసం త్యాగం చేశారు. ప్రభుత్వం చేత వారికి జేపీ పారితోషికం ఇప్పించారు (భూ సేకరణ చట్టం గురించే ప్రజలకు తెలియని దశలో, బ్రిటిష్ చట్టాలతో పాలకులు ప్రజల భూములను లాక్కుంటున్న తరుణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు అప్పట్లో గరిష్ఠ నగదు పరిహారాన్ని, 8,000 కుటుంబాలలోని యువతకు శిక్షణతో ఉద్యోగాలను ప్లాంట్ స్పెషలాఫీసర్‌గా జేపీ ఇప్పించారు. ఇది తన ఐఏఎస్ కెరీర్ తొలిదశలో. ప్రకాశం జిల్లా కలెక్టర్ కాకముందు). తరువాతి కాలంలో ప్రభుత్వం నిధులను కేటాయించటంతో పథకం విస్తరణ, కాలువల మరమ్మతులు, నాపరాళ్లతో కాలువలకు లైనింగ్ పనులను చేపట్టారు. ఇంత ఆదర్శప్రాయ సమష్టి విజయం కాబట్టే.. ఈవేళ్టికీ జేపీ మార్గదర్శకత్వం, ప్రోత్సాహం గురించి ఉలిచి గ్రామస్తులు ఇంకా గుర్తుపెట్టుకుని ప్రస్తావిస్తున్నారు.

ఎంతగా వారు జేపీని అభిమానిస్తున్నారో ఆయన కలెక్టర్‌గా వేరే జిల్లాకు వెళ్తున్నప్పుడు 1989, జనవరి 14న ‘క్రాంతిరేఖ’ పేరుతో వారిచ్చిన అభినందన పత్రాన్ని చూస్తే తెలుస్తుంది. ఈ పత్రం కాపీని కూడా వారు మాకు ఇచ్చారు. ఇందులో..

‘సామర్థ్యం, నిజాయితీ, చిత్తశుద్ధి, స్థితప్రజ్ఞత, సంయమన దృక్పథం కలిగి, అనురక్తితో అంకితభావంతో అహర్నిశలు, అలుపెరుగక సమాజం కొరకు పనిచేసి వెలలేని కీర్తిసంపదనార్జించిన మా జిల్లా కలెక్టరు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఐఏఎస్ గారిని

ప్రేమించడం, అభిమానించడం, గౌరవించడం మా మహద్భాగ్యంగా భావిస్తాం.

మా మాగాణి భూములలో ప్రవహించే ప్రతి నీటి బిందువులో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారు ప్రతిబింబిస్తారు.





మా భూములలో పండే ప్రతి వడ్ల గింజ మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు లిఖించబడి ఉంటుందని మా నమ్మకం.

మేము తినే మెతుకు మెతుకు మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు మెరుస్తూనే ఉంటుంది.


డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి ఆశయాలు, ఉన్నత భావాలు భావితరాలవారికి ఆదర్శాలు కావాలని ఆశిస్తాం' అని రాశారు.

ఇప్పుడున్న వ్యవస్థలో ఒక ఐఏఎస్‌గా నేననుకున్న దాంట్లో 20శాతం మార్పును మాత్రమే సాధించగలుగుతున్నా, అదే వ్యవస్థను సరిచేసి ప్రజలను కేంద్రబిందువు చేయగలిగితే 80శాతం మేర సాధించగలను.. అంటూ ప్రతి పౌరుని శక్తిసామర్థ్యాలూ ఈ దేశాభివృద్ధికి ఉపయోగపడేలా చేసే రాజకీయ, పాలనా సంస్కరణల కోసం ఆ తర్వాత జేపీ లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. లోక్‌సత్తా సంస్కరణల్లో అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ముందు వరసలో ఉండటానికి, 2003లో దేశంలోనే రికార్డుస్థాయిలో 1కోటీ 8లక్షాల సంతకాల సేకరణను, పలు ఉద్యమాలను లోక్‌సత్తా చేపట్టటానికి.. ప్రకాశం జిల్లా అనుభవాలు కూడా పెద్ద స్ఫూర్తి అనుకోవటానికి ఏమాత్రం సందేహించాల్సిన పన్లేదు".

5,000 ఏళ్లపైబడిన భారతదేశ చరిత్ర, కేంద్రీకృత పాలన వల్ల స్వతంత్ర దేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరుల్లా మెజారిటీ ప్రజలు బతుకుతుండటం, అమూల్, అలందూర్, ఇస్రో, తార్నాక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రకాశం జిల్లాలో జేపీ ఆధ్వర్యంలో నిర్మించిన సాగునీటి పథకాలు.. ఇవన్నీ చెప్పేదొకటే- ప్రభుత్వానికి- ప్రజలకు మధ్య గోడల్ని బద్దలు కొట్టి జనం చేతికి జవాబుదారీతనంతో వీలైనంత ఎక్కువ అధికారాల్ని ఇవ్వాలి!

పటిష్టమైన స్థానిక పాలన మన సమస్యలన్నిటికీ సర్వరోగనివారిణి అని చెప్పటం అతిశయోక్తి అవుతుంది. భారీస్థాయిలో ఓట్ల కొనుగోలు సంస్కృతి, అధికార దుర్వినియోగం, వనరుల దోపిడీ, అవినీతి- ఇవన్నీ పైస్థాయిలోలాగే స్థానిక పాలనలో కూడా పాతుకుపోయాయి. పర్యావరణ అనుమతులు వంటి అంశాలలో స్థానికంగా నిర్ణయాధికారం ఇచ్చిన చోట ప్రజల్ని రెచ్చగొట్టటం, లాభాలు ఆశించటం వంటి తీవ్రస్థాయి ఆరోపణలు వచ్చాయి. ఇటీవల టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటోరియల్ బృందంలోని ఒక సీనియర్ జర్నలిస్టు తమ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఏ) ఏకపక్ష వ్యవహారశైలి మీద తన కాలమ్‌లో బాధను వెళ్లగక్కారు. దేశాన్ని, రాష్ట్రాలను ఏలుతున్న సాంప్రదాయ కేంద్రీకృత ప్రభుత్వాలకు, ఆర్‌డబ్ల్యుఏలకు తేడా లేకుండా పోయిందన్నారు. అలాంటప్పుడు స్థానిక పాలనను విశ్వసించటం మంచిదా? రాజకీయాలలో, పాలనారంగంలో, పౌరసమాజంలో, అధ్యయనంలో అర్థవంతమైన, లోతైన, ప్రజాసేవ దృక్పథం కలిగిన ఆలోచనాపరులు, కార్యకర్తలలో ఆందోళన రేకెత్తిస్తున్న ప్రశ్న ఇది. కానీ మన సమస్యలకు నిజమైన పరిష్కారాలు పౌరులకి, ప్రభుత్వానికి మధ్య దూరం తొలగిపోయి, ఎక్కడికక్కడ ప్రజలు ప్రభుత్వ నిర్వహణలో భాగస్వాములు కావటంలోనే ఉన్నాయి. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు కావచ్చు, పంచాయతీలు, వార్డులు కావచ్చు.. వీటిల్లో పరిష్కారాలు స్థానికంగా, మన చేతుల్లో ఉంటాయి. ఇలాంటప్పుడు కూడా మనం బాధ్యత తీసుకోలేకపోతే, ఇక ఈ దేశాన్ని ఎప్పటికీ బాగుచేసుకోలేం. ఇతర దేశాలకు వెళితే మనం స్థానిక ప్రభుత్వాల్ని అభినందిస్తాం, బుద్ధిమంతుల్లా అనుసరిస్తాం. కానీ మనదేశానికొచ్చేసరికి మాత్రం స్థానికతను చిన్నచూపు చూస్తాం. ఉమ్మడి అవసరాలను ఎవరో వచ్చి మన కోసం చేసిపెట్టాలనుకుంటాం. మనదేశంలో ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే రోజువారీ సేవలను అందించటంలో సాధించిన విజయాలన్నీ స్థానిక స్వయంపాలనతో, వికేంద్రీకరణతో వచ్చాయి తప్ప కేంద్ర హుకుంలు, నియంత్రణల ద్వారా కాదు. పన్నులు-సేవలకు మధ్య సంబంధం ప్రజలకి అర్థమై అధికారాన్ని-జవాబుదారీతనాన్ని మరింతగా కలగలిపినప్పుడు మాత్రమే పాలన బాగుపడుతుంది. ★

# సమగ్ర భూ సర్వేలో 'సమగ్రత' ఎంత?



- సాతులూరి గోవిందరావు,
లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
99853 46047

**తెలంగాణ ప్రభుత్వం సమగ్ర భూ రికార్డుల సర్వేను చేపట్టటం స్వాగతించాల్సిన నిర్ణయమే అయినా, అంత హడావుడిపడటమెందుకో అర్థం కాదు. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయకుండా, పాలనా వ్యవస్థలో తగిన మార్పులు తేకుండా లేడికి లేచిందే ప్రయాణమన్నట్టు చేసే సర్వేలు ఎలా ఉంటాయో ఇప్పటికే చూశాం. ఎంతో సంచలనంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే, సమగ్ర రైతు సర్వేలు ఏమయ్యాయో అందరికీ తెలుసు. వాటికోసం ఎంతో ప్రజాధనాన్ని, ప్రభుత్వ కార్యాలయాల్లోని శ్రమశక్తిని వృధా చేశారు. మళ్లీ అదే హడావుడితో భూసర్వేను నిర్వహిస్తున్నారు. భూ రికార్డులను సక్రమం చేసి రైతులకు, ఇతర భూయజమానులకు న్యాయం చేయటం, అసైన్డ్ భూములను పరిరక్షించటం, అందరికీ ఎదిగే అవకాశాల దిశగా భూ సంబంధాలను సంస్కరించటం మీదకన్నా.. వచ్చే ఏడాది నుంచి రైతు ఖాతాల్లోకి ఎకరాకు రూ.8వేల పెట్టుబడిని బదిలీ చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఆత్రమే కేసీఆర్ ప్రభుత్వానికి ఎక్కువగా కనిపిస్తోంది.**

ఎప్పుడో నిజాం కాలంలో 1932-36 మధ్యకాలంలో తెలంగాణలో భూసర్వే జరిగింది. దాదాపు 80 ఏళ్ల తర్వాత ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,875 రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రామం యూనిట్‌గా నిర్వహిస్తున్నారు. రైతుల సహకారంతో భూదస్త్రాలను నవీకరించటం, ఇంటర్నెట్‌లో ఉంచటం, దస్త్రాలన్నీ సరిచేశాక కొత్త పాసు పుస్తకాలివ్వటం ఈ కార్యక్రమంలో భాగంగా చేస్తారు. బాగానే ఉంది కానీ.. అవినీతి, కేంద్రీకృత రాజకీయం, పాలన, నల్లడబ్బు ఎన్నికల వ్యవస్థ వల్ల తెలంగాణలో కొన్ని దశాబ్దాలుగా చాలా భూముల లావాదేవీలు గాడితప్పాయి. పలుచోట్ల రికార్డులకు తగ్గ భూమి లేదు. ప్రభుత్వ భూముల్ని కూడా సొంత భూముల కింద రిజిస్టర్ చేయించుకున్నారు. భూముల అక్రమాలపై కేసీఆర్ స్వయంగా జరిపించిన దాడుల్లో కబ్జాలు నిగ్గుతేలినా చర్యల్ని మాత్రం తొక్కిపట్టారు. వన్ వీక్ సంచలన వార్తలకింద అవి కొట్టుకుపోయాయి. రాష్ట్రంలో భూముల పరిరక్షణ బాధ్యత భూ పరిపాలనా ప్రధాన కమిషనర్‌ది. ప్రభుత్వం చేపట్టిన.. దళితులకు మూడెకరాల భూపంపిణీలాంటి కీలకమైన పథకాలు కూడా సీసీఎల్ఏ గుర్తించిన తర్వాతే ముందుకు వెళ్లాలి. కానీ సీసీఎల్ఏ స్థానం చాలాకాలం ఖాళీగా ఉన్నది. 31 జిల్లాల్లో రెవెన్యూ అధికారుల కొరత ఉంది. వీటికితోడు సిబ్బంది పనితీరులో లోపాల గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. రెవెన్యూ ఆఫీసుల్లో ఎప్పటికప్పుడు 1 బి రికార్డులను అప్‌డేట్ చేయకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయి. రెండున్నరేళ్ల క్రితం ప్రభుత్వం ప్రారంభించిన 'భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ (జీవో 59)గానీ, 2014లోని ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పరచుకున్నవారికి ఆయా భూములను క్రమబద్ధీకరించే ప్రక్రియగానీ ఒక కొలిక్కి రాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సాదాబైనామాలను క్రమబద్ధీకరించేందుకు గతేడాది ప్రారంభించిన కార్యక్రమంలో వచ్చిన 11లక్షలకు పైగా దరఖాస్తుల్లో సగం కూడా పరిష్కరించలేకపోయారు. ఇన్ని కంతలు పెట్టుకుని, వాటిని సరిచేసే ప్రయత్నమే లేకుండా భూసర్వేను హడావుడిగా ముగించేస్తున్నారు.

## (పార్టీ) రాజకీయ సమన్వయ సమితులతో రైతుల్ని చీల్చవద్దు



తమ పంటలకు లాభాల్ని సంపాదించుకోవాలంటే రైతులు కులం, ప్రాంతం, భాష, పార్టీ, పంటలపేరుతో చీలిపోకుండా ఏకంకావాలని డా॥ జేపీ 'రైతు ఐక్యతా యాత్రలను' నిర్వహించారు. స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య వేదికను ఏర్పాటు చేసి వ్యవసాయ సంస్కరణలపై రైతుల్లో అవగాహన పెంచుతూ వాటిని సాధించేందుకు పోరాడారు. బియ్యం ఎగుమతులపై కేంద్రప్రభుత్వం, ఇతర రాష్ట్రాల్లో రైతులు అమ్ముకోకుండా రాష్ట్రప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేసేలా చేశారు. దీనివల్ల దేశానికి భారీ విదేశీ మారక ద్రవ్యం లభించడంతోపాటు, 2012లో తెలంగాణ, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని ఒక్క బీపీటీ రైతులకే ఒక్క సీజన్‌లోనే రూ. 3,600కోట్ల మేర మేలుజరిగింది. కౌలురైతులు కూడా బాగుపడ్డారు. కానీ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితులు అధికార పార్టీ రాజకీయంతో నిండిపోయాయి. రైతులు పార్టీలు, కులాలవారీగా చీలిపోతున్నారు. కాంగ్రెస్ హయాంలో ఆదర్శ రైతులంటూ ఏర్పాటు చేసి రైతులు కానివారికి కూడా నెలనెలా జీతాలిచ్చి తమ పార్టీ కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన తీరులోనే కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇప్పటికే మార్కెట్ యార్డులను అధికార పార్టీ నేతలతో నింపేశారు. ముఖ్యమంత్రి ఏకపక్ష నిర్ణయాలు చేస్తుంటే అంతా దూడూ బసవన్నల్లా తలలూపుతున్నారు. కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన కనిపించటం లేదు. తెరాసకు గ్రామాల్లో నాయకులను తయారుచేసుకుంటూ ఎన్నికల్లో గెలవాలన్న యావ తప్ప.. రైతులకు మేలుచేద్దామన్న సంకల్పం కొరవడింది. రైతుల్ని చీల్చే ధోరణుల వల్ల పెద్ద రైతులకు తప్ప చిన్న, సన్న, మధ్యతరగతి రైతులకు ఆర్థిక ప్రయోజనం, సామాజిక ప్రాధాన్యత తగ్గుతాయి. ఇది తెలంగాణ గ్రామాల్లో రాజకీయ, సామాజిక తిరోగమనానికి దారితీసే ప్రమాదముంది. జమిందారులు, దొరలు, దేశ్‌ముఖ్‌ల పాలన కాలానికి తెలంగాణను తీసుకెళ్లటానికా రాష్ట్ర సాధన చేసింది?

మరికొన్ని నవీకరణల్ని కూడా ఈ కార్యక్రమంతో జతచేసి చూపుతున్నారు. భూమి రిజిస్టర్ అయినరోజే మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ రోజు మాత్రమే రైతులు రిజిస్ట్రార్ ఆఫీసుకు వస్తే డాక్యుమెంట్లు అన్నీ నేరుగా ఎంఆర్‌వో ఆఫీసుకు పంపి పాస్‌బుక్‌ను పోస్టు ద్వారా రైతు ఇంటికే పంపిస్తాము అంటున్నారు. తర్వాతికాలంలో ఇంటి వద్ద నుంచి కూడా రిజిస్ట్రేషన్ సదుపాయాలు తెస్తామంటున్నారు. కానీ ఇక్కడ కూడా అసలు సమస్యను మాత్రం ప్రస్తావించటం లేదు. రైతుకి రిజిస్ట్రేషన్ ఆఫీసులో అయ్యే లంచాల ఖర్చు కంటే, ఎంఆర్‌వో కార్యాలయంలో అయ్యే లంచాల ఖర్చు ఎక్కువ. రాష్ట్రంలో పలుకుబడి, రాజకీయ అండ ఉన్న కొద్దిమందిని మినహాయిస్తే ఇప్పటివరకూ రూ. 5వేలకు తక్కువ లంచం ఇచ్చి పాస్‌పుస్తకం తెచ్చుకున్న రైతు ఎవరన్నా ఉన్నారేమో చూపండి! ప్రభుత్వం ఎన్ని కబుర్లు చెప్పినా, ఎంత సాంకేతికతను చూపిస్తున్నా రెవెన్యూ కార్యాలయంలో దళారులను ఆశ్రయించనిదే, లంచం ఇవ్వనిదే పనులు జరగవని క్షేత్రస్థాయి వాస్తవాలు స్పష్టంచేస్తున్నాయి. ఉన్నత స్థాయిలో మరిన్ని అధికారాలు కల్పించటం, పర్యవేక్షణ వంటి చర్యలతో అవినీతికి ఆస్కారం లేకుండా చేస్తామని ప్రభుత్వం నమ్మబలుకుతోంది. అవన్నీ చేయండి, కానీ ముందు ప్రభుత్వ కార్యాలయాల్లో సకాలంలో ప్రజలకు లంచాలు, దేబిరింపులు, అవమానాలు లేకుండా పనులు జరిగేందుకు 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తీసుకురండి. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ చట్టం నమూనాను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పంపారు. దీనికి సంబంధించి ఎలాంటి సహకారం అందించటానికైనా సిద్ధమని లేఖ రాశారు. సర్వీస్ గ్యారంటీ బిల్లు రూపకల్పన బాధ్యతను నల్సార్‌కి ప్రభుత్వం అప్పగించింది. ఇదంతా జరిగి ఏడాది గడుస్తున్నా.. ఏం జరిగిందని ప్రభుత్వం ఆరా తీసిన దాఖలాలు లేవు. రైతులకు లంచాలు లేకుండా నిర్ణీత వ్యవధిలో పట్టాదారు పాసుపుస్తకాలుగానీ, ఇంకో సర్టిఫికెట్‌గానీ అందాలంటే.. పౌర సేవల చట్టాన్ని తేవటం ముఖ్యం. రైతులకేకాదు అన్ని వర్గాలవారికీ ఎంతో మేలు చేసే

పౌర సేవల చట్టాన్ని తేవటానికి ఏమిటి కేసీఆర్ ప్రభుత్వానికి సమస్య?

1972 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పీవీ నరసింహారావు ప్రారంభించిన భూసంస్కరణల ద్వారా తెలంగాణలో చిన్న, సన్న, మధ్యతరగతి కమతాలు ఏర్పడ్డాయి. అప్పటి కేంద్రప్రభుత్వం కూడా ఇందుకు అండగా నిలిచింది. "భూమి లేని నిరుపేదలకు భూమి పంచాలని, దాని ద్వారా భూకమతాల్లో చోటుచేసుకున్న అసమానతల్ని తొలగించాలని, కుటుంబం యూనిట్‌గా సీలింగ్ నిర్ధారించాలని, బంజర్‌గా వ్యవహరించే ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని, అంతవరకూ భూస్వాముల హక్కుభుక్తంలో ఉంటూ మిగులుభూమిగా తేలనున్న లక్షలాది ఎకరాల భూమిని షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి, బలహీనవర్గాల వారికి వ్యవసాయం కొరకు పంచాలని, వ్యవసాయ కూలీలకు ఉజ్వల భవిష్యత్ కల్పించాలని, గ్రామీణ సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాలని" భూ సంస్కరణల చట్టం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ. 8వేల సబ్సిడీ పథకంతో ఎక్కువగా లబ్ధిపొందేది చిన్న, సన్న, మధ్యతరగతి రైతులే. రైతు సమన్వయ సమితులో, మరోటో పేరుతో గ్రామాల్లో స్వార్థశక్తులు పాగా వేసి చిన్న రైతులను దెబ్బతీయకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు పాటించాలి. రైతులకు ప్రభుత్వ పథకాల నుంచి చెప్పుకోదగిన లాభం అందాలంటే ప్రభుత్వం.. రాజ్యాంగం మీద ప్రమాణం చేసినట్టు రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తేనే సాధ్యం.

### వ్యవసాయ విధానాల్ని కొత్తగా రూపొందించాలి

ఎకరాకు రూ. 8వేల నుంచి పంట బీమా వరకు ఎన్ని రకాలుగా రైతులకు రాయితీల్ని కల్పించినా, వాటన్నిటికంటే ముఖ్యం రైతు పండించిన పంటకు న్యాయమైన ధర రావడం! పంటకు రైతుకొచ్చే ధరకు –మార్కెట్‌లో వినియోగదారుడు అదే ఉత్పత్తిని కొనుగోలు చేసే ధరకు మధ్య రూ. 50–60 అంతరం ఉంటుందంటే.. రైతుకు న్యాయంగా రావాల్సిన డబ్బును ఎన్ని రాయితీలతో ప్రభుత్వం భర్తీ చేయగలదు? కాబట్టి 'రైతులకు ఆదాయం' చుట్టూ ప్రభుత్వం వ్యవసాయ విధానాలను కొత్తగా రూపొందించాలి. పాలనలో మార్పు అంటే ఇదీ!

రైతుకు ఆదాయం ఉంటే ప్రకృతి ఆటుపోట్లను తట్టుకోగలడు. కానీ ప్రభుత్వ విధానాలు ఆదాయాన్ని పెంచేవిగా లేకపోతే.. ప్రతి ప్రకృతి వైపరీత్యమూ అతనికి/ఆమెకు

**ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ. 8వేల సబ్సిడీ పథకంతో ఎక్కువగా లబ్ధిపొందేది చిన్న, సన్న, మధ్యతరగతి రైతులే. రైతు సమన్వయ సమితులో, మరోటో పేరుతో గ్రామాల్లో స్వార్థశక్తులు పాగా వేసి చిన్న రైతులను దెబ్బతీయకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు పాటించాలి. రైతులకు ప్రభుత్వ పథకాల నుంచి చెప్పుకోదగిన లాభం అందాలంటే ప్రభుత్వం.. రాజ్యాంగం మీద ప్రమాణం చేసినట్టు రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తేనే సాధ్యం.**

భరింపరాని సంక్షోభంగా మారుతుంది. అంటే.. రైతు సంక్షోభం ప్రకృతి శాపం వల్ల కాదు.. పాలకుల పాపం వల్లే!

రైతుకు ఆదాయం చుట్టూ రూపొందించే వ్యవసాయ విధానంలో.. రైతులు మార్కెట్‌తో తేలిగ్గా అనుసంధానమయ్యేలా ఏర్పాట్లుండాలి. ధర లేనప్పుడు నిల్వ చేసుకునేందుకు సాధారణ, శీతల గిడ్డంగుల్ని నిర్మించాలి. వీటిని ఎక్కడో దూరంగా కాకుండా.. రైతులకు అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులతో నిర్మాణం చేయాలి. కుళ్లిపోయే పంటలకు ధర వచ్చేందుకు వీలుగా ఆహారశుద్ధి కర్మాగారాలను అందుబాటులోకి తేవాలి. నిల్వ చేసుకున్న పంటలను తనఖా పెట్టుకుని బ్యాంకులు 'ప్లెడ్జి రుణాలు' ఇచ్చేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. మార్కెట్ యార్డుల్లో రాజకీయ జోక్యం లేకుండా చేసి, రైతులకు అప్పగించి పర్యవేక్షణ, అవినీతి జరిగితే చర్యలకే ప్రభుత్వం పరిమితం కావాలి. ఈ చర్యలు లేకపోవడం వల్ల తెలంగాణ ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న పాలీపౌస్‌ల పరిస్థితి కూడా లాభదాయకంగా లేదు. రైతులు పంటను దళారులకు అయినకాడికి అమ్ముకుంటున్నారు. గిట్టుబాటు ధర రానప్పుడు రోడ్ల మీద పారబోసిపోతున్నారు. వినియోగదారులు కూడా అధిక ధరలతో నష్టపోతున్నారు. రైతులకు విత్తనం దగ్గర్నుంచీ నూతన సాంకేతిక పరిజ్ఞానం, నిల్వ సదుపాయాలు, రవాణా సౌకర్యం, రిటైల్ మౌలిక వసతులు, మార్కెట్ అవకాశం, కొన్ని రకాల రాయితీలు, ప్లెడ్జి రుణాలు అందుబాటులోకి తేకుండా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా ఫలితం ఉండదు.

సమగ్ర భూసర్వేపై ప్రభుత్వం సమగ్ర దృష్టి పెట్టి ఇతర సంస్కరణలతో అనుసంధానం చేస్తే రైతులకు నిజమైన మేలు జరుగుతుంది, గ్రామాలకు–పట్టణ ప్రాంతాలకు మధ్య అంతరం తగ్గి ప్రజాస్వామిక తెలంగాణ సాకారమవుతుంది. ★

# చరిత్రలో చిరస్థాయిగా 'కారా'



ప్రముఖ సాహితీవేత్త, కథానిలయం వ్యవస్థాపకుడు కాళీపట్నం రామారావు చరిత్రలో చిరస్థాయిగా నిలిపోవటం తథ్యమని జేపీ అన్నారు. కథలను సేకరించి ఆ కథలను డిజిటల్ రూపంలో పొందుపరచటం ద్వారా ఆయన ఈ దేశ పరంపరకు ఎంతో మేలుచేశారన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన జేపీ.. కారా మాస్టారుని మర్యాదాపూర్వకంగా కలిశారు. కథానిలయాన్ని సందర్శించారు.

ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి కథానిలయం ఏర్పాటు కాలేదని, తెలుగు కథలన్నీ ఒకేచోట చేర్చి భావితరాలకు చేర్చాలనే ఆలోచన, సంస్కారవంతంగా జీవించాలనే మాస్టారి ఆకాంక్ష గొప్ప విషయాలని జేపీ కొనియాడారు. సిక్కోలు ప్రజలు ధన్యజీవులన్నారు. కారా మాష్టారి మాటల్లో, భావాల్లో స్వచ్ఛత కనిపిస్తుందని, మేధస్సులో సృజన, జ్ఞాపకశక్తి, వ్యక్తిత్వంలో ఔన్నత్యం ప్రస్ఫుటమవుతాయని అన్నారు. కారా సాహిత్యం, జీవితం పరస్పర ప్రభావితాలుగా స్ఫూర్తి కలిగిస్తాయన్నారు. వనరులను వృధా చేయకపోవడం, సమాజానికి ఉపయోగపడే ప్రతి కృషినీ భద్రపరచటం మనలో ప్రతి ఒక్కరూ సంస్కృతిగా పెంపొందించుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా సందర్శన పుస్తకంలో కారా వ్యక్తిత్వం గురించి జయప్రకాష్ నారాయణ్ కొన్ని వాక్యాలు రాశారు. ★

# సురాజ్య ఆలోచనలు, జేపీ భావాలపై షార్ట్ ఫిల్మ్ తీస్తాం

యువతే దేశానికి ఆశాకిరణమని, అందుకే యువత ఆవేశాలకు లోనుకాకుండా ఆదర్శభావాలతో పనిచేయాలని జేపీ అన్నారు. జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా సిక్కోలు వంశధార అతిథి గృహంలో ఉన్న ఆయన్ను డ్వాన్ ఫ్రాన్సర్స్ షార్ట్ ఫిల్మ్ యువకులు కలిశారు. ధూమపానం అలవాటు నిరోధంపై అవగాహనకు తీసిన షార్ట్ ఫిల్మ్‌ను జేపీకి చూపారు. ఎలాగైనా ఓట్లు సంపాదించి ఎన్నికల్లో గెలవాలనే రాజకీయాలకు కాకుండా సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంలో భాగమయ్యే రాజకీయానికి అండగా నిలవాలని జేపీ వారిని కోరారు. సామాజిక మార్పు కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అభిరాం మాట్లాడుతూ.. త్వరలో లోక్‌సత్తా సురాజ్య ఆలోచనలపై,



జయప్రకాష్ నారాయణ్ ఆదర్శ భావాలపై షార్ట్ ఫిల్మ్ తీసి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. టీంలో పవన్‌దినకర్, శరత్, రాంబాబు, తిరుమల, అశోక్, శ్రీను, సురేష్ తదితరులు ఉన్నారు. ★

# ప్రభుత్వాసుపత్రులను బాగుచేయటమంటే రంగులేయటమా?



ప్రభుత్వాసుపత్రులను బాగు చేశామని చెబుతూ రంగులేస్తే సరి పోతుందా అని జేపీ ప్రశ్నించారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ విజయనగరంలోని ఘోషా ఆసుపత్రిని సందర్శించారు. పలువురు గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ఓపీ, ఐపీ ఎంత ఉందో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సీతారామ రాజును అడిగి తెలుసుకున్నారు. నిధుల వివరాలను, ఖర్చును బేరీజు వేశారు.

అనంతరం జేపీ మాట్లాడుతూ, ఘోషా ఆసుపత్రిలో సేవల ఫర్వాలేదనిపించేలా ఉన్నాయని, అయితే ముమ్ముందు నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని భరోసా ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. ఇక్కడ ఓపీ రోజుకు దాదాపు 2,500మంది దాకా ఉందని, దీనివల్ల అదనంగా భారం పడుతోందని అన్నారు. కనీసం నెలకు 40,000 మందిని అదనంగా ఇక్కడ వైద్యసిబ్బంది చూడాల్సి వస్తోందన్నారు. వచ్చిన పేషెంట్లను తిప్పి పంపకుండా చూడాలి కాబట్టి.. ఐపీలో ఉన్న బెడ్‌లలోనే అందరినీ సర్దేస్తున్నారన్నారు. ఘోషా ఆసుపత్రి వైద్యసేవలకు ఏడాదికి రూ. 15 కోట్లు ఖర్చవుతుండగా, ఇదే సేవల్ని ప్రైవేటు రంగంలో అందించాలంటే రూ. 100కోట్లపైనే అవుతుందన్నారు. అయినా ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తూ ప్రైవేటు రంగానికి బాగు చేయటానికి ప్రయత్నిస్తున్నారుగానీ, రోగికి ఆర్థికభారం లేకుండా వైద్యం అందేలా విధానాలను రూపొందించటం లేదన్నారు. ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయటం లేదన్నారు. ఈ ఆసుపత్రిలోని వైద్యులకు చెల్లిస్తున్న జీతభత్యాలు ప్రైవేటుతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని, వీరిలో ఎక్కువమంది ప్రైవేటు రంగంలో మెరుగైన అవకాశం వస్తే వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారని, అందుకే ముమ్ముందు నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని ధీమాగా అనుకోలేకపోతున్నామని అన్నారు. వైద్య సిబ్బంది సమస్యను పరిష్కరించటంతోపాటు.. విధానపరమైన మార్పులు చేస్తే ఇలాంటి ఆసుపత్రుల వల్ల పేద, మధ్యతరగతికి మేలు జరుగుతుందన్నారు.

ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్యాన్ని బలోపేతం చేయాలని, దిగువన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పటిష్టంగా ఉంటే ఘోషా ఆసుపత్రి మీద ఒత్తిడి తగ్గుతుందని జేపీ అన్నారు. పీహెచ్‌సీల మీద నమ్మకం లేకే చిన్న చిన్న జబ్బులకు కూడా పెద్దాసుపత్రులకు వస్తున్నారన్నారు. గర్భిణీ, బాలింతలకు తగిన సేవలను దిగువ స్థాయిలోనే సమర్థవంతంగా అమలుచేయాలన్నారు. రోగికి వైద్యాన్ని అందించటాన్ని వైద్యవిధానానికి కేంద్రబిందువు చేయాల్సింది పోయి.. అనవసర ఆర్భాటాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైద్యవ్యవస్థను బాగుచేసుకోవటం సమాజానికి అత్యంత మౌలికావసరమని, సురాజ్య యాత్ర ఎజెండాలో ఇది తొలి ప్రాధాన్యాంశమని అన్నారు. ఈ కృషిలో భాగస్వాములయ్యేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో చేరిపోవాలన్నారు. దీనికి ఎటువంటి రుసుమూ లేదని, తమ పట్ల, తమ చుట్టూ ఉన్న సమాజం పట్ల ఆసక్తి ఉంటే చాలని అన్నారు.

కార్యక్రమంలో ఆంధ్రా చైతన్య పార్టీ వ్యవస్థాపకుడు కె. రామునాయుడు, మెడికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఉషారాణి, ఆర్‌ఎంవో రామ్మోహన్, బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ★

# గురజాడ అడుగుజాడ మరో వందేళ్లయినా చెక్కుచెదరదు



తెలుగు భాషను దీర్ఘకాల భావాలతో పరిపుష్టం చేసి జనంలోకి వ్యాపింప చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్ర కోసం విజయనగరం జిల్లాకొచ్చిన జయప్రకాష్ నారాయణ్.. పట్టణంలోని గురజాడ ఇంటిని సందర్శించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ వాడిన వస్తువులను, ఆయన చిత్రమాలికను పరిశీలించారు.

దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని.. ఇప్పటి పాలకులకు కూడా అర్థంకాని వాస్తవాన్ని వందేళ్ల క్రితమే గురజాడ చెప్పారని జేపీ అన్నారు. తనను వేధించే కానిస్టేబుల్ ట్రాన్స్‌ఫర్ అవుతాడా? అని గాంధీ ఎవరో కూడా తెలీని రోజుల్లో తన కన్యాశుల్కంలోని ఓ పాత్ర ద్వారా ప్రశ్నించారని, పాలనా సంస్కరణల ఆవశ్యకతను తెలియచెప్పారని అన్నారు. సుమారు 130 ఏళ్ల క్రితం రాసిన గురజాడ కన్యాశుల్కం మరో వందేళ్లయినా ప్రాముఖ్యతను కోల్పోదన్నారు.

గురజాడ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని జేపీ అన్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న గురజాడ ఇంటిని మ్యూజియంగా మార్చి ప్రజలకు అందించిన ఆయన వారసులను ఆదుకోవాలన్నారు. అంతే విలువైన స్థలాన్ని వారికి అందించాలన్నారు. ఈ విషయంలో లోక్‌సత్తా నేతలు చేస్తున్న కృషిని అభినందించారు.

**గురజాడ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని జేపీ అన్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న గురజాడ ఇంటిని మ్యూజియంగా మార్చి ప్రజలకు అందించిన ఆయన వారసులను ఆదుకోవాలన్నారు. అంతే విలువైన స్థలాన్ని వారికి అందించాలన్నారు. ఈ విషయంలో లోక్‌సత్తా నేతలు చేస్తున్న కృషిని అభినందించారు.**

గురజాడ ఇచ్చిన నినాదాలను ఆచరణలోకి తెచ్చే విధానాలను లోక్‌సత్తా అందిస్తోందని జేపీ అన్నారు.

గురజాడ మునిమనుమలు, భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా ఇతర నేతలు జేపీ వెంట ఉన్నారు. ★

# 'జాతీయ పతాకం' పుస్తకావిష్కరణ



భారతీయుల ఔన్నత్యానికి జాతీయ పతాకం ప్రతీక అని జేపీ అన్నారు. ఈ పతాకంలోని రంగులు, అందులోని నీలిరంగు ధర్మచక్రం చెప్పే విలువలను భారతీయులు నిరంతరం గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు నిర్మాణాత్మక దేశభక్తిని పెంపొందించాలన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన సముద్రాల గురుప్రసాద్ రాసిన 'జాతీయ పతాకం' పుస్తకాన్ని ఆయన విజయనగరంలో ఆవిష్కరించారు.

జాతీయ పతాకం రూపకల్పన, ప్రాశస్త్యం తదితర అంశాలను పుస్తకంలో సమగ్రంగా వివరించారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. కార్యక్రమంలో బండారు రామ్మోహనరావు, రచయిత గురుప్రసాద్, స్పార్క్ సంస్థ ప్రతినిధి పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు. ★

# బాలికల చదువు దేశాభివృద్ధికి పునాది



బాలికల చదువు దేశాభివృద్ధికి పునాది అని జేపీ అన్నారు. శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం రేగులపాడులోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సురాజ్య యాత్రలో భాగంగా ఆయన సందర్శించారు.

విద్యార్థినులతో మాట్లాడుతూ వారి ఆలోచనలను, విషయ పరిజ్ఞానాన్ని అంచనా వేసేందుకు జేపీ ప్రయత్నించారు. ఆశలు, కలలు ఉండాలని, వాటితోపాటు అవగాహన ఉంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని అన్నారు. అనంతరం కేజీవీబీ సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ★

# అసాధ్యాన్ని సుసాధ్యం చేసేది చదువే





బొబ్బిలి శివార్లలోని ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో జేపీ కాసేపు ముచ్చటించారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. గణితం, సైన్స్ సబ్జెక్టులతోపాటు కొన్ని ఇతర అంశాలను బోధించారు. తర్వాత 9, 10వ తరగతులకు సంబంధించిన కొన్ని ప్రశ్నలను విద్యార్థులనడిగారు. వారు సూటిగా సమాధానాలు చెప్పటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీ రామారావు ఎంతో సదుద్దేశంతో గురుకుల పాఠశాల్ని స్థాపించారన్నారు. చదువుకోవడం మనందరి హక్కని, పాఠ్యాంశాలలో అనుమానాలుంటే ఉపాధ్యాయులను ప్రశ్నించాలన్నారు. బట్టీయం వద్దన్నారు. స్కూలు బైట కూడా అధ్యయనం చేయటాన్ని ఒక అలవాటుగా పెంపొందించుకోవాలన్నారు. చదువే ఆయుధమని, చదువు ద్వారానే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలమని అన్నారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న గుత్త ఉపాధ్యాయులు తమ సమస్యలపై వినతిపత్రం అందచేయగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేపీ హామీ ఇచ్చారు.

వైబీఐ నేతలు, రామ్మోహనరావు, బాబ్జీ, ఆకుల దామోదరరావు, సూరిబాబు, లక్ష్మీ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**గొల్లపల్లి స్కూలుకీ వస్తా**

తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సీఆర్‌టీలు బొబ్బిలి ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో జేపీకి వినతిపత్రం అందించారు. తాము 12 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తమను మెరిట్ కమ్ రోస్టర్‌లో నియమించారని, అయితే రాష్ట్ర విభజన గందరగోళంలో తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కూడా తమకు న్యాయం జరగలేదని, తమను రెగ్యులరైజ్ చేసేందుకు సహకరించాలని సీఆర్‌టీలు జి.అరుణ, కె.జయలక్ష్మి, బి.తులసీబాయి తదితరులు కోరారు. దీనికి జేపీ సానుకూలంగా స్పందించారు. అలాగే పాఠశాల టెక్స్ట్‌బుక్‌ల రైటర్, గొల్లపల్లి ఎస్వీజీ ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఉషారాణి కూడా జేపీని కలిసినవారిలో ఉన్నారు. తమ పాఠశాలలో అమలు చేస్తున్న సుబోధిని కార్యక్రమాన్ని వివరించారు. చిన్నారులతో విషయాన్ని చెప్పించి తమ పాఠశాలకు రావలసిందిగా ఆహ్వానించారు. మరోసారి బొబ్బిలి వచ్చినప్పుడు తప్పక గొల్లపల్లి వస్తానని ఆమెకు జేపీ హామీ ఇచ్చారు. ★

# పాలనా దారిద్ర్యానికి నిదర్శనం పొట్టి శ్రీరాములు మార్కెట్

పాలనా దారిద్ర్యమే పొట్టి శ్రీరాములు మార్కెట్ దుస్థితికి కారణమని జేపీ అన్నారు. చిన్న సమస్యను పరిష్కరించి కార్పొరేషన్‌కు ఆదాయం తెచ్చుకుందామన్న ధ్యాసే అధికారులు, ప్రజాప్రతినిధులకు కరువైందన్నారు. ఇదే సొంత పని అయితే, అదనంగా పనిచేసి మరీ పరిష్కరించేవారన్నారు. తనది కాకపోతే ఢిల్లీ దాకా దేకమన్నట్టు.. జనం సొమ్ము ఎటుపోతే తమకేంటి అన్నరీతిలో ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తోందన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను జయప్రకాష్ నారాయణ్ సందర్శించారు. మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు కోరాడ హరిగోపాల్ ఆయనకు స్వాగతం పలికారు.

అక్కడి సమస్యలను వ్యాపారులను ప్రజలను అడిగి జేపీ తెలుసుకున్నారు. కూరగాయల వర్తకులతో ఆప్యాయంగా ముఖాముఖి నిర్వహించారు. పరిష్కారాలపై వారి అభిప్రాయాలను విన్నాక మాట్లాడుతూ.. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని జేపీ హామీ ఇచ్చారు. వ్యాపారులు, నేల దుకాణదారులు ఇబ్బందిపడుతుంటే పాలకులు, అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించటం బాధాకరమన్నారు. దుకాణాలను వాడకపోవడం వల్ల అవి కూలిపోయే పరిస్థితికొచ్చినా పట్టించుకోకుంటే ఇక పాలన ఏమిటని ప్రశ్నించారు. స్థానిక సమస్యల్ని, డిజైన్లని ఇక్కడే కాకుండా అమరావతిలో, ఢిల్లీలో నిర్ణయిస్తుంటే ఇలాగే ఉంటుందన్నారు. ప్రభుత్వం వ్యాపారులతో సమావేశం నిర్వహించేలా చేస్తానన్నారు. సమస్యల్ని పరిష్కరిస్తే వ్యాపారులతోపాటు తమకు కూడా మేలు జరుగుతుందని, ప్రభుత్వానికీ ఆదాయం వస్తుందని ప్రజలు కూడా గుర్తించాలన్నారు.

రామ్మోహనరావు, బాబ్జీ, విష్ణుమూర్తి, పోలినాయుడు, జగదీష్, అప్పలనాయుడు, జానకిరాం, సంతోష్, పంచాది రాంబాబు, ఆకుల నాగేశ్వరరావు తదితర నేతలు జేపీతో పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ★



**వ్యాపారులు, నేల దుకాణదారులు ఇబ్బంది పడుతుంటే పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం బాధాకర మన్నారు. దుకాణాలను వాడకపోవడం వల్ల అవి కూలిపోయే పరిస్థితికొచ్చినా పట్టించుకోకుంటే ఇక పాలన ఏమిటని ప్రశ్నించారు.**

# ఏక్‌పృథ్వీ కార్యక్రమంలో..


సురాజ్య యాత్రలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని డాక్టర్ బీవీరాజు విద్యాసంస్థల్లో జరిగిన ఏక్‌పృథ్వీ కార్యక్రమంలో జేపీ పాల్గన్నారు. పర్యావరణ హితం దిశగా మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, కాలుష్య నియంత్రణ, విద్యుత్ ఆదా, ప్రత్యామ్నాయ ఇంధనం తదితర అంశాలపై విద్యార్థులకు సూచనలిచ్చారు. ★







# 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర... ఇంకొన్ని క్లిక్‌లు














Posting Date 07-11-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on November1st 2017

# మీ స్పందనకు సలాం!
# జేపీతో కనెక్ట్ అవ్వండి

## ‘జనం కోసం జేపీ’ సురాజ్య యాత్రలో మీ విశేష స్పందనకు సలాం!

## మన సమస్యల పరిష్కారం కోసం
## “జేపీ వెబ్ ప్లాట్‌ఫారాల” ద్వారా
## పార్టీకతీతంగా చర్చలు, కార్యక్రమాల్లో మున్ముందూ భాగమవుదాం,
## ‘మార్పు’ను సాధించుకుందాం!

## మనం కాకపోతే ఇంకెవరు?....ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

జేపీతో కాంటాక్ట్‌కు: www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta, www.youthforbetterindia.com, www.citizensforbetterindia.com, www.fdrindia.org

## Join SURAJYA YATRA

Support

YBI

Youth for Better India




www.youthforbetterindia.com

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad